

దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 138 | ది. 1-8-2025 | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 138 | Date : 1-8-2025 | Friday | Pages : 8 | Rs.1/- |



## తెలంగాణ హైకోర్టులో నలుగురు కొత్త జడ్జిల ప్రమాణస్వీకారం

**హైదరాబాద్,జూలై 31 (వార్తాప్రభ) :** తెలంగాణ హైకోర్టులో కొత్తగా నియమితులైన నలుగురు జడ్జిలు గురువారం ప్రమాణ స్వీకా రం చేశారు. జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్, జస్టిస్ రామకృష్ణా రెడ్డి, జస్టిస్ సుద్దాల చలప తిరావు, జస్టిస్ గౌస్ మీరా మొహియుద్దీన్‌తో సీజే జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ప్రమాణం చేయించారు. హైకోర్టులో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు న్యాయమూర్తులు, లాయర్లు హాజరయ్యారు. హైకోర్టులో లాయర్లుగా ఉన్న ఈ నలుగురిని జడ్జిలుగా నియమించాలంటూ సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దీంతో వారి నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 28న ఆమోదముద్ర వేశారు. దీంతో రాష్ట్ర హైకోర్టులో జడ్జిల సంఖ్య 30కి చేరింది.

# ప్రకృతి ఒడిలో అమరావతి

## అమరావతి ఇన్ నేచర్ కాన్సెప్టుతో రాజధాని నిర్మాణం

- రహదారులు, కూడళ్లు, గ్రీన్ బెల్ట్, బఫర్ జోన్లలో ఆహ్లాదకరమైన వాతావరణం
- దేశీయ వృక్షజాతులు, ఔషధ మొక్కలకు ప్రాధాన్యం ఇస్తూ హరిత ప్రణాళిక
- సింగపూర్ బిడదారి హౌసింగ్ ప్రాజెక్టు తరహాలో అమరావతిలో గృహనిర్మాణం
- అమరావతి బ్యూటిఫికేషన్, గ్రీన్-బ్లూ మాస్టర్ ప్లాన్ పై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



**అమరావతి,జూలై 31 (వార్తాప్రభ) :** రాజధాని అమరావతి నగరాన్ని అతిపెద్ద లంగ్ స్పేస్ నగరంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతి ఇన్ నేచర్ అనే కాన్సెప్టుతో హరిత ప్రణాళికల్ని అమలు చేయాలని సూచించారు. గురువారం సచివాలయంలో అమరావతి బ్యూటిఫికేషన్, గ్రీన్-బ్లూ మాస్టర్ ప్లాన్ పై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాజధానిలో నిర్మితం అవుతున్న ప్రధాన ట్రంక్ రోడ్లు, అనుబంధ రహదారులు, ఎల్పీఎస్ లేఅవుట్ల వద్ద నిర్మించే రహదారులు, బఫర్ జోన్లు, గ్రీన్ జోన్లు, ముఖ్యమైన కూడళ్లను అత్యంత ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దేందుకు వీలుగా పచ్చదనాన్ని పెంపొందించాలని సీఎం స్పష్టం చేశారు. రహదారుల వెంబడి అవెన్యూ ప్లాంటేషన్ చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో పార్కులు, హరిత ప్రాంతం ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అలాగే ఔషధ మొక్కలు నాటటంతో పాటు రాజధాని ప్రాంతం అంతా జీవ వైవిధ్య ప్రాంతంగా మారాలని పేర్కొన్నారు. గ్రీన్ బెల్ట్ , బఫర్ జోన్లలో దేశీయ వృక్ష జాతులు ఉండేలా చూడాలని సూచించారు. అలాగే రివర్ ఫ్రంట్ ను అత్యంత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అన్నారు.

**బ్లూ, గ్రీన్, పుష్ప వికసిత రాజధాని..** గ్రీన్, బ్లూ నగరంగా అమరావతిని తీర్చిదిద్దటంతో పాటు ఏడాది పొడవునా వివిధ కాలాల్లో వేర్వేరు జాతుల పుష్పాలు వికసించి ఆహ్లాద పరిచేలా మొక్కలు నాటాలని సీఎం పేర్కొన్నారు. ప్రజలు, పర్యాటకులు వాటి గురించి మాట్లాడుకునేలా ఈ పుష్పాలు సీజన్ల వారీగా వచ్చేలా ప్రణాళిక చేపట్టాలని స్పష్టం చేశారు. రాజధాని ప్రాంతంలో వివిధ ఫల, పుష్ప జాతులకు చెందిన మొక్కలు, చెట్లు ఉండేలా కార్యాచరణ చేప ట్టాలని ఏడీసీ అధికారులకు సూచించారు. అమరావతిని సుందరంగా తీర్చిదిద్దేందుకు బెంగుళూరు నగరంతో పాటు సింగపూర్ సహా వివిధ ప్రాంతా లను కూడా పరిశీలించాలని పేర్కొన్నారు. అలాగే ఔషధ మొక్కలు, అరుదైన, అంతరించి పోతున్న జాతుల మొక్కలు, వృక్షాలను కూడా సంరక్షిస్తున్న ప్రాంతంగా అమరావతి ఉండాలని సూచించారు. ఔషధ మొక్కలను పెంచేందుకు ప్రముఖ యోగాగురు బాబారామ్ దేవ్ నుంచి సూచనలు సలహాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఏపీలో నర్సరీలు కలిగిన ప్రాంతంగా ప్రసిద్ధి చెందిన కడియంను కూడా ప్రోత్సహించేలా చూడాలన్నారు. హిమాలయాల నుంచి కన్యాకుమారి వరకూ వివిధ ప్రాంతాల్లో ఉన్న దేశీయ వృక్ష జాతులను కూడా అమరావతిలో పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ గ్రీన్ ప్రాంతం అంతా కాలుష్యాన్ని నియంత్రించటంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేలా ఉండాలని స్పష్టం చేశారు. అమరావతి బ్యూటిఫికేషన్ ప్రణాళికలో స్థానికంగా ఉన్న యూనివర్సిటీలు, విద్యార్థుల సహకారం కూడా తీసుకోవాలని సూచించారు. చారిత్రక నగరంగా అమరావతి సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడటంతో పాటు ఆధునికంగా పార్కులను తీర్చిదిద్దాలని అన్నారు.

**సేదదీరేలా కృష్ణా రివర్ ఫ్రంట్..** రాజధాని అమరావతి నగరంలోనూ అత్యంత నాణ్యమైన, అందరికీ అందుబాటులో గృహ నిర్మాణం ఉండాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సింగపూర్‌లోని బిడదారి హౌసింగ్ ప్రాజెక్టు తరహాలోనే రాజధాని నగరంలో గృహ నిర్మాణ ప్రాజెక్టుల వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చెట్లు, పార్కులు నిర్మించాలని స్పష్టం చేశారు. 250 ఎకరాల ప్రాంతంలో 10 వేల మంది నివసించేలా బిడదారి ఎస్టేట్ ను నిర్మించారన్నారు. అలాగే ప్రకృతిలో సేదదీరేలా వివిధ ప్రాంతాలను తీర్చిదిద్దాలన్నారు. రాజధానిలో నిర్మించే వివిధ పార్కుల్లో వివిధ దేశాల పేర్లను పెట్టటంతో పాటు ఆయా దేశాల్లో పెరిగే పుష్ప జాతుల మొక్కలు ఉండేలా చూడాలన్నారు. ప్రధాన రహదారులకు ప్రకృతి పేర్లు కలిసొచ్చేలా పెట్టాలని స్పష్టం చేశారు. అలాగే అమరావతిలో కొండవీటి వాగు, పాలవాగు సహా కాలువల వ్యవస్థను కూడా అత్యంత సుందరంగా కనిపించేలా ప్రణాళికలు చేయాలని స్పష్టం చేశారు. కృష్ణాతీరం ఇరువైపులా అహ్లాదకరమైన వాతావరణం ఉండేలా మార్చాలన్నారు. రహదారి మార్గాలకు ఇరువైపులా సైక్లింగ్ ట్రాక్ లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. శాఖమూరు రిజర్వాయర్ ను 50 ఎకరాల ప్రాంతంలో సిద్ధం చేస్తున్నట్టు ఏడీసీ అధికారులు సీఎంకు వివరించారు. ఆ సరస్సు చుట్టూ గ్రీనింగ్ తో పాటు సేదతీరేందుకు వీలుగా చెట్లను నాటాలని సీఎం సూచించారు. రహదారుల వెంట వెళ్తున్న వారు కూడా ప్రకృతిని ఆస్వాదించేలా బ్యూటిఫికేషన్ జరగాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మరోవైపు కృష్ణానదిలో ప్రకాశం బ్యారేజికి ఎగువన ఉన్న ఆరు దీవుల్ని కూడా సుందరంగా తీర్చిదిద్ది రివర్ ఫ్రంట్ లను ఏర్పాటు చేయనున్నట్టు అధికారులు వివరించారు. అయితే పర్యావరణానికి ఎక్కడా ఇబ్బంది లేకుండా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉండవల్లి కొండ ఉన్న ప్రాంతం నగరంలో మధ్యన ఉంటుందని ఎక్కడి నుంచి చూసినా పూలతో అందమైన వనంలా కనిపించేలా మొక్కలు నాటాలని అన్నారు.


### పాస్‌పోర్టు పోయినది

ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ రూరల్, రామవరప్పాడు, పట్టెలవారివీధి, ప్రఖ్యా రెసిడెన్సీ, ఫ్లాట్ నెం.201 కాపురస్తుడు తేలు అప్పారావు గారి కుమారుడు తేలు శ్రీనివాసరావు అను నాపేరిట విశాఖపట్నంలో ది.08-12-2009న జారీచేసిన ఒరిజినల్ పాస్‌పోర్టు నెం.హెచ్7093180 మరియు కొన్ని కాగితములు కలిగిన బ్యాగ్‌తో ది.30-07-2025వ తేదీన మా ఇంటివద్ద నుండి విజయవాడ రైల్వే డిఆర్‌యం ఆఫీసుకు బిఆర్‌టిఎస్ రోడ్డు గుండా బైక్‌పై వెళుతుండగా మీసాల రాజారావు వంతెన దగ్గరలో జారిపడిపోయినది. వెంటనే పరిసర ప్రాంతంలో వెదకిననూ కనిపించలేదు. సదరు పాస్‌పోర్టును ఉపయోగించి, ఎవ్వరైనా ఎటువంటి అన్యాక్రాంతములు జరిపిన యెడల చట్టప్రకారం తీసుకునే యావత్తు చర్యలకు బాధ్యులు కాగలరని తెలియ జేయుచూ, ఎవరికైనా ఒరిజినల్ పాసుపోర్టు దొరికినచో నాకు తెలియపరచినచో తగిన పారితోషకం ఇవ్వబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సెల్ నెం. 8885692373


## జగన్ కోసం జన సునామీ



**నెల్లూరు,జూలై 31 (వార్తాప్రభ) :** మూడు వేల మందికిపైగా పోలీసుల మోహరింపు. ఎటు చూసినా ముళ్ల కంచెలు, బారికేడ్లతో కాపలా. వాహనాలు తిరగకుండా రోడ్లు తవ్వేసిన పరిస్థితులు. ఆఖరికి.. ఆర్టీసీ బస్సులను సైతం ఆపేసి జనాల ఫోన్లను తనిఖీలు చేయడం లాంటి పరిస్థితులు గత రెండు రోజులుగా నెల్లూరులో కనిపించాయి. అయితే ఆ ఆంక్షల చెరను తెంచుకుని జగన్ కోసం జనప్రవాహం ఇవాళ తరలి వచ్చింది. వైఎస్ జగన్ నెల్లూరు పర్యటన కోసం దేశంలో ఎక్కడా లేని ఆంక్షలను, ఎన్నడూ వినని షరతులను కూటమి ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. పోలీస్ వ్యవస్థను ఉపయోగించి జగన్ పర్యటనను విఫలం చేయాలని అన్ని విధాలా ప్రయత్నించింది. ఈ క్రమంలో.. వైఎస్సార్‌సీపీ నేతలకు నోటీసులు జారీ చేశారు. జనసమీకరణ చేస్తే కఠిన చర్యలు తప్పవని, జగన్ పర్యటన వైపే రావొద్దంటూ హెచ్చరికలూ జారీ చేశారు. తమ బలం, బలగంతో వైఎస్సార్‌సీపీ నేతలనైతే ఆపగలిగారు. కానీ.. జన ప్రభంజనాన్ని మాత్రం ఏ పోలీసు చట్టం ఆపలేకపోయింది. జగన్ రాకతో గురువారం ఉదయం నెల్లూరు రహదారులన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. పోలీసుల వలయాన్ని దాటుకుని.. జగన్ కోసం తండోపతండాలుగా తరలి వచ్చారు. పార్టీ శ్రేణులు, అభిమానుల జేజేలతో అడుగడుగునా ఆయనకు అపూర్వ స్వాగతం లభించింది. ఆ అభిమానాన్ని అంతే ఆప్యాయంగా అభివాదం చేసి అందుకున్నారాయన. జై జగన్ నినాదాలతో సింహపురి గర్జించింది. "మనల్ని ఎవడ్రా ఆపేది" అంటూ వచ్చిన ఆ జన సునామీని ఆపడం పోలీసుల వల్ల కాలేకపోయింది.

# ట్రంప్ చెప్పింది నిజమే...

## -మన ఆర్థిక వ్యవస్థను మోదీ చంపేశారు :: రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, జూలై 31 (వార్తాప్రభ) :** ఇండియన్ ఎకానమీ డెడ్ ఎకానమీ అని యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ చెప్పింది నిజమేనని రాహుల్ గాంధీ అన్నారు. ప్రధాని మోదీ హయాంలో భారత ఆర్థిక వ్యవస్థను చంపేశారని సంచలన కామెంట్స్ చేశారు రాహుల్. మోదీనే ఎకానమీని చంపేశారని అన్నారు. గురువారం పార్లమెంట్ ఆవరణలో ట్రంప్ చేసిన కామెంట్స్ పై మాట్లాడుతూ రాహుల్ ఈ విధంగా స్పందించారు.భారత ఆర్థిక వ్యవస్థ నాశనం కావడానికి కారణాలను రాహుల్ వెల్లడించారు.మోదీ హయాంలో సహచరుల కోసం తీసుకున్న నిర్ణయాలు,అదే విధంగా ఎకానమిక్ పాలసీల కారణంగా ఆర్థిక వ్యవస్థ నాశనం అయ్యిందని మండిపడ్డారు. ఇండియన్ ఎకానమీ నాశనం కావడానికి ముఖ్యమైన 5 పాయింట్లను రాహుల్ రైజ్ చేశారు. అవి. మోదీ-అదానీ ఫ్రెండ్?షిప్ డీమానిటైజేషన్, జీఎస్టీ ఇండియాలో తయారీ పేరున అసెంబుల్ చేయడం సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు లను నాశనం చేయడం, రైతులను అణచివేయడం,

**ట్రంప్ చేసిన వ్యాఖ్యలు..** ఇండియాపై 25 శాతం టారిఫ్స్ విధిస్తామని ట్రంప్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఇండియన్ ఎకానమీ గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇండియా రష్యాతో స్నేహం కోరుకుంటోందని.. కానీ రష్యా లాగే ఇండియన్ ఎకానమీ కూడా డెడ్ ఎకానమీ అని అన్నారు. ఈ రెండు దేశాలు పతనమైన ఆర్థిక వ్యవస్థలను కలిసి మరింత కిందికి తీసుకెళతాయని అయితే దానిని తాను అస్సలు పట్టించుకోనంటూ వ్యాఖ్యానించారు.

# ఆగస్ట్ 2న 'అన్నదాత సుఖీభవ' అమలు

- 46,85,838 మంది రైతులకు పథకంతో లబ్ది
- మొదటివిడతలో ఒక్కో రైతుకు రూ.5,000
- రూ.2,342.92 కోట్ల నిధుల కేటాయింపు
- కేంద్రం ఇచ్చే రూ.2 వేలతో కలిపి మొత్తం రూ.7 వేలు జమ
- ప్రకాశం జిల్లా దర్శిలో ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- ఒకరోజు ముందే 'మనమిత్ర' ద్వారా లబ్దిదారులకు సందేశం
- సాగునీటి ఎద్దడి, ఎరువుల కొరత రానివ్వకండి
- జిల్లా కలెక్టర్లకు, అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం
- సందేహాల నివృత్తికి 155251 టోల్ ఫ్రీ నెంబర్



**అమరావతి, జూలై 31 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని ఆగస్ట్ 2న అమలు చేయాలని నిర్ణయించింది. ప్రకాశం జిల్లా దర్శి మండలం వీరాయపాలెంలో ఈ పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. దీంతో రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులు లబ్ది పొందుతారు. మొదటి విడతలో రాష్ట్ర వాటాగా ఒక్కో రైతుకు రూ.5,000 చొప్పున మొత్తం రూ.2,342.92 కోట్ల నిధుల్ని వారి ఖాతాలో ప్రభుత్వం నేరుగా జమ చేయనుంది.

**రైతులకు సాయం భారం కాదు... బాధ్యత :** 'అన్నదాత సుఖీభవ' అమలు సన్నద్ధతపై గురువారం సచివాలయంలో ఆర్థిక, రెవెన్యూ, జల వనరులు, వ్యవసాయ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి పలు ఆదేశాలు జారీ చేశారు. అర్హులైన ప్రతీ రైతుకూ అన్నదాత సుఖీభవ అందాలని, రైతులకు చేయూతనివ్వడం భారం కాదు.. బాధ్యతగా గుర్తు పెట్టుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతులకు నిధులే కాదు.. నీళ్లూ ఇస్తున్నామని చెప్పారు.

**ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకున్నాం :** 'ఆగస్ట్ 2న 'అన్నదాత సుఖీభవ' పథకం అమలు కార్యక్రమం పండుగ వాతావరణంలో జరగాలి. గ్రామ సచివాలయం నుంచి పంచాయతీలు, మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహించాలి. గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను చిన్నాభిన్నం చేసింది. నాడు ఆర్థిక విధ్వంసం జరిగింది. ప్రతీ వ్యవస్థను పునర్నిర్మిస్తున్నాం. ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. రైతులకు హామీ ఇచ్చినట్టుగానే 'అన్నదాత సుఖీభవ'ను అమలు చేసి చూపించాం. పథకాలు అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకున్నాం. చేసిన మంచిని ప్రజలకు చెప్పాలి. రాజకీయ నేతలు పాలసీలు మాత్రమే తయారు చేస్తారు... వాటిని అమలు చేసేది అధికారులే. వ్యవస్థలో అందరూ జావాబుదారీతనంతో వ్యవహరించాలి. అన్నదాత సుఖీభవ అందుకునే రైతులకు సెల్ ఫోన్లకు ఒకరోజు ముందే 'మనమిత్ర' ద్వారా సందేశాలు వెళ్లాలి. రైతులు తమ ఖాతాలను యాక్టివేట్ చేసుకునేలా వారికి అవగాహన కల్పించండి.' అని ముఖ్యమంత్రి అన్నారు.

**వ్యవసాయ ఎగుమతులపై అమెరికా సుంకాల ప్రభావం :** 'ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు వివరించాలి. బొప్పాయి ధర తగ్గిందని కథనాలు వస్తున్నాయి... వాటిపైనా సమీక్ష చేసి రైతులకు న్యాయం చేయాలి. ఎరువుల విషయంలో కలెక్టర్లు బాధ్యతగా వ్యవహరించాలి... ఎక్కడా కొరత రానీయొద్దు. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. గండికోట, బ్రహ్మంసాగర్, సోమశిల, కండలేరు ప్రాజెక్టులను వందశాతం నీటితో నింపాలి. రిజర్వాయర్లలో ఎంత నీరు ఉందనే సమాచారం ఉండాలి. నీటి నిర్వహణను పకడ్బందీగా అమలు చేయాలి. భారత్‌పై అమెరికా 25 శాతం సుంకాలు విధించింది. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్ని దృష్టిలో పెట్టుకుని ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొనాలి. ఇప్పటి వరకు రైతులకు ప్రభుత్వం అందించిన సాయం, ఇతర వివరాలతో కరపత్రం రూపొందించి క్షేత్రస్థాయిలో ఇవ్వాలి' అని ముఖ్యమంత్రి కలెక్టర్లకు సూచించారు.

**ఆగస్ట్ 2న ఒక్కో రైతుకు మొత్తం రూ.7,000 జమ :** ఒక్కో రైతు కుటుంబానికి కేంద్రం సాయంతో కలిపి ఏడాదికి రూ.20,000 చొప్పున అందిస్తామన్న కూటమి హామీని 'అన్నదాత సుఖీభవ', 'పీఎం కిసాన్' అమలుతో నెరవేర్చినట్టయ్యింది. ఏడాదికి కేంద్రం ఇచ్చే రూ.6,000 సాయంతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.14,000 ఇవ్వనుంది. మొదటి, రెండో విడత రూ.5 వేల చొప్పున, అలాగే మూడో విడత రూ.4 వేలు రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. ఈ రూ.14 వేలను 3 విడతలుగా అందించాలని గతంలోనే నిర్ణయించారు. కేంద్రం మొదటివిడతగా రూ.2,000 చొప్పున రూ.831.51 కోట్లు రైతులకు సాయం చేయనుంది. దీంతో ఆగస్ట్ 2న కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఒక్కో రైతుకు రూ.7,000 జమ చేసినట్టు అవుతుంది. మరోవైపు 'అన్నదాత సుఖీభవ'కు సంబంధించి 59,750 గ్రీవెన్సులు నమోదుకాగా... వాటిలో 58,464 దరఖాస్తులను పరిష్కరించారు. ఈ పథకంపై సందేహాలను నివృత్తి చేసేందుకు 155251 టోల్ ఫ్రీ నెంబర్‌ను అందుబాటులో ఉంచారు. ఈ సమీక్షలో సీఎస్ కె.విజయానంద్, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, సీసీఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయలక్ష్మీ, సీఎం ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పియూష్ కుమార్, సీఎం కార్యదర్శి రాజమౌళి, అగ్రికల్చర్ డైరెక్టర్ డిల్లీరావు, జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

# సింగపూర్ లో మంత్రి నారాయణ విస్తృత పర్యటన

- అమరావతి నిర్మాణానికి సంబంధించిన పలు అంశాలపై అధ్యయనం చేస్తున్న మంత్రి.
- సింగపూర్ లో వేస్ట్ మేనేజ్ మెంట్ ను పరిశీలించిన మంత్రి
- అర్బన్ రీ డెవలప్ మెంట్ అధారిటీ,రోడ్ డెవలప్ మెంట్ అధారిటీ అధికారులతో విడివిడిగా సమావేశాలు
- సింగపూర్ లో మొట్ట మొదటి భారీ చికెన్ ప్రాసెసింగ్ యూనిట్ సందర్శించిన మంత్రి
- ఐకానిక్ వర్టికల్ గార్డెన్ నిర్మాణాలను పరిశీలించిన మంత్రి,సీఆర్డీయే కమిషనర్ కన్నబాబు



**సింగపూర్,జూలై 31 (వార్తాప్రభ) :** రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ సింగపూర్ పర్యటన కొనసాగుతుంది. అమరావతి నిర్మాణానికి సంబంధించిన పలు అంశాలపై మంత్రి నారాయణ అధ్యయనం చేస్తున్నారు..సింగపూర్ తరహా స్మార్ట్ సిటీగా అమరావతి నిర్మించాలని ప్రభుత్వం గతంలోనే నిర్ణయించింది...దీనికోసం సింగపూర్ ప్రభుత్వం అనుసరిస్తున్న పలు విధానాలను అమరావతి కోసం ఉపయోగించుకునే ఆలోచనలో ఉంది...అమరావతి నిర్మాణంలో కీలక పాత్ర వహిస్తున్న మంత్రి నారాయణ....రాజధానిని ప్రపంచంలో అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దేలా సింగపూర్ లోని బెస్ట్ ప్రాక్టీసెస్ ను అధ్యయనం చేస్తున్నారు.గురువారం సింగపూర్ లో పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు మంత్రి నారాయణ..సీఆర్డీయే కమిషనర్ కన్నబాబుతో కలిసి పలు అంశాలపై అధ్యయనం చేసారు. గురువారం ఉదయం సింగపూర్ లో వేస్ట్ మేనేజ్ మెంట్ పై అధ్యయనం చేసారు...సింగపూర్ లో ఘన వ్యర్థాల నిర్వహణ కోసం అక్కడి ప్రభుత్వం తీసుకున్న చర్యలను అధికారులు మంత్రి నారాయణకు వివరించారు..,చెత్త తరలింపునకు వినియోగిస్తున్న వాహనాలను మంత్రి పరిశీలించారు...ఆధునిక టెక్నాలజీతో చెత్తను సేకరించి వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ లకు తరలిస్తున్న విధానాన్ని మంత్రి నారాయణ పరిశీలించారు. ఆ తర్వాత సింగపూర్ ల్యాండ్ ట్రాన్స్ పోర్ట్ అధారిటీ, ప్రతినిధులతో సమావేశమయ్యారు సమావేశమైన మంత్రి నారాయణ...సింగపూర్ లో ఉపరితల రవాణా సౌకర్యాలు,మౌళిక వసతుల కల్పన,రోడ్ల నిర్మాణం వంటివి ఈ అధారిటీ పర్యవేక్షణలో ఉంటాయి...ప్రజా రవాణా వ్యవస్థ,వాకింగ్ ట్రాక్ లు,సైక్లింగ్ ట్రాక్ ల నిర్మాణం కూడా ఈ అధారిటీ పరిధిలోనే ఉంటాయి..ప్రస్తుతం సింగపూర్ లో ఉన్న రవాణా వ్యవస్థ గురించి అక్కడి అధికారులు మంత్రి నారాయణకు వివరించారు...అమరావతిలో కూడా సింగపూర్ తరహాలో రోడ్ల నిర్మాణం,వాకింగ్,సైక్లింగ్ ట్రాక్ లు నిర్మించనుంది ప్రభుత్వం...ఆయా నిర్మాణాలకు సంబంధించి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు మంత్రి మధ్యాహ్నం సింగపూర్ అర్బన్ రీ డెవలప్ మెంట్ అధారిటీ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు మంత్రి నారాయణ,సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు..సింగపూర్ అభివృద్ధికి సంబంధించి ఎప్పటికప్పుడు ఈ అధారిటీ కీలక నిర్ణయాలు తీసుకుంటుంది.


సురేష్ కమ్యూనికేషన్స్
Digital India
CSC
పాన్ కార్డు, పాస్‌పోర్టు
డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ బుకింగ్స్
మనీ ట్రాన్స్‌ఫర్, మనీ విత్‌డ్రా
ఆర్.టి.ఎ సర్వీసెస్
జి.యస్.యం, బి.ఎస్సీ
ఎ.ఎస్.యం రిజిస్ట్రేషన్ & రెన్యూవల్
రైల్వే టికెట్లు బస్ టిక్కెట్లు రిజర్వేషన్
బైక్, కారు, ఆటో, ఇన్సూరెన్స్
ఆన్‌లైన్ జాబ్ & ఎగ్జామ్ అప్లికేషన్స్
లైఫ్ సర్టిఫికెట్లు
Bank of Baroda BC point

డోర్ నెం. 14-5-16, లేపాక్షి ఎదురుగా, గాంధీనగర్, విజయవాడ - 03

# అంతా నా ఇష్టం

*అంగన్వాడీ సూపర్వైజర్ తీరు*

*మానసిక,వేదనకు గురవుతున్న అంగన్వాడీ ఉద్యోగులు*

*సూపర్వైజర్ తీరిపై- జిల్లా కలెక్టర్ సిడిపిఓ సమగ్ర విచారణ*

*జరపాలని కోరుతున్న ప్రజా సంఘాల నాయకులు*



**దంతాలపల్లి, జూలై 31 (వార్తా ప్రభ):**మండలంలోని పెద్దముప్పారం సెక్టారూలో పనిచేస్తున్న అంగన్వాడి టీచర్లు,హెల్పర్లకు దినదిన గండంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వారి పై అధికారి సూపర్వైజర్ ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని,ఆమె చెప్పిందే వేదం,ఆమె చేసిందే చట్టం,ఆమె పలికిందే న్యాయమంటూ కింది ఉద్యోగుల పై దుర్భాషలాడుతూ దూషిస్తూ దళితులను అవమానకరంగా మాట్లాడుతూ దళిత ఉద్యోగులను కించపరుస్తూ అగ్రవర్ణాలకు అండగా నిలబడుతూ వారిపై పైశాచిక ఆనందాన్ని పొందుతున్న ఆ సూపర్వైజర్ అరాచకాలకు అడ్డు లేదా ? గతంలో కూడా కథనాలు రావడంతో సంబంధిత జిల్లా అధికారి చర్యలు తీసుకుంటామని చెప్పడం గమనార్హం.ఆమెపై చర్యలు తీసుకోకపోవడం విడ్డూరం,నేడు ఆమె ప్రవర్తన తీరు అగమ్య గోచరం సెలవు తీసుకోవాలన్న,ఆమెకు ఫోన్ చేయాలంటే అంగన్వాడీ టీచర్లు ఆయాల్లో వణుకు,ఆమె ఇష్టానుసారంగా సెంటర్లకు రావడం ఆమె ఇష్టానుసారంగా వెళ్లిపోవడం అసలు రాకుండా కూడా ఫోన్ ద్వారా ఉద్యోగులను టార్చర్ పెట్టడం ఇదే తంతుగా శాడిస్ట్ గా చాదస్తంతో ఆమె చేస్తుందని,ఉద్యోగమా రాచరికమా అనే విధంగా ఆమె రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా అహంకార పూరిత విధానాలు,ఆమె ఉండే సాన్నిత్యం అగ్రవర్ణాలతో దళిత, బిసి ఉద్యోగులపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్న సూపర్ వైజర్ పై జిల్లా అధికారులు సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని అంగన్వాడీ సిబ్బంది కోరుతున్నారు.

**పట్టదారుల వివరాలనుపారదర్శకంగా**

# ఎంక్వయిరీ చేయాలి..

**రెండు రోజుల్లో రిపోర్ట్ అందించాలి..**

**రాష్ట్ర సిసిఎల్ఎ కమిషనర్ లోకేష్ కుమార్**

**సర్వే సెటిల్మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు**




**జగిత్యాల, జూలై 31 (వార్తాప్రభ)**రీ సర్వే చేసిన పట్టాదారుల వివరాలు, పహానీ లోని వివరాలపై పారదర్శకంగా ఎంక్వయిరీ చేయాలని రాష్ట్ర సిసిఎల్ఎ కమిషనర్ లోకేష్ కుమార్, సర్వే సెటిల్మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు లు ఆయా జిల్లా కలెక్టర్ లను ఆదేశించారు. జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలం కొమనపల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్ చేపట్టిన (రీ-సర్వే) పై గురువారం రాష్ట్ర సిసిఎల్ఎ సర్వే సెటిల్మెంట్ కమిషనర్ లోకేష్ కుమార్ హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగిత్యాల కలెక్టరేట్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), బీఎస్ లత, ఆర్డీవో మధుసూదన్, ఏడి ఎస్ అండ్ ఎల్ ఆర్ ఎస్ బీర్పూర్ తహసీల్దార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడాతూ అధికారులకు పలు, సూచనలు సలహాలు అందజేశారు. బీర్పూర్ మండలం కొమనపల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద (రీ-సర్వే)కు సంబంధించి తీసుకున్నామని తెలిపారు. రీ సర్వే చేసిన పట్టాదారుల వివరాలు.. పహానీలోని వివరాలు ఎంక్వైరీ చేసి 2 రోజుల్లో రిపోర్ట్ సమర్పించాలని జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ. సర్వే సిబ్బందికి ఫీల్డ్ వెళ్ళి విచారణ జరిపి రిపోర్టు సమర్పించాలని సూచించారు. భూ సమస్యల పరిష్కారానికి సంబంధించి అధికారులు పూర్తి పారదర్శకంగా.. చట్టం ప్రకారం.. నిబంధనల మేరకు వ్యవహరించాలని కమిషనర్ పేర్కొన్నారు. ఎక్కడా నిర్లక్ష్యం వహించినా అధికారులదే పూర్తి బాధ్యత అని.. ఇందుకు బాధ్యతయుతంగా పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు. నిర్లక్ష్యం వహించినట్టు తెలిస్తే చర్యలు తప్పవని కమిషనర్ పేర్కొన్నారు.

## సన్న బియ్యం ను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి

*జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే*

**ఆసిఫాబాద్ జూలై 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రజా పంపిణీ వ్యవస్థలో చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సన్న బియ్యం ను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లాలోని సిర్పూర్ - యు మండలం మహాగాం రైతు వేదికలో సిర్పూర్ - యు, లింగాపూర్ మండలాల నూతన రేషన్ కార్డుల మంజూరు పత్రాలు పంపిణీ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండలాధికారి లోకేశ్వర్ రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ లతో కలిసి హాజరై లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందిస్తుందని, ఈ క్రమంలో రేషన్ కార్డుదారులకు చౌక ధరల దుకాణాల ద్వారా అందిస్తున్న సన్న బియ్యం ను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ప్రజా పాలనా కార్యక్రమంలో నూతన రేషన్ కార్డులు, కుటుంబ సభ్యుల పేర్లు చేర్చడం కొరకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హులైన పేదవారికి రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. సిర్పూర్ - యు మండలానికి 241 నూతన రేషన్ కార్డులు, లింగాపూర్ మండలానికి 304 నూతన రేషన్ కార్డులు, కుటుంబ సభ్యుల చేరికతో 25 రేషన్ కార్డుల మంజూరు పత్రాలు అందించడం జరిగిందని తెలిపారు.

# సాయి ఎక్స్ లెంట్ ఆధ్వర్యంలో నవోదయ శిక్షణ

**నవోదయ శిక్షణ ఇంచార్జ్ అశోక్ కుమార్**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జూలూరుపాడు, మండల కేంద్రంలో లోని సాయి ఎక్సలెంట్ స్కూల్ ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన నవోదయ ఎంట్రెన్స్ పరీక్షకు శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్కూలు నవోదయ శిక్షణ ఇంచార్జ్ ఎస్. అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-2026 విద్య సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సాయి ఎక్సలెంట్ స్కూల్లో శిక్షణ ఇచ్చేందుకు మేము సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. గతంలో సాయి ఎక్స్ లెంట్ స్కూల్ శిక్షణ ద్వారా 2024-2025 విద్యా సంవత్సరంలో ఆరుగురు విద్యార్థులు నవోదయ సీటు సాధించడం జరిగిందని, ఇంకా సీట్లు సాధించేందుకు అదే స్ఫూర్తితో శిక్షణ ఇస్తున్నట్లు ఆయన వివరించారు. విద్యార్థులను నవోదయ పాఠశాలలకు పంపి ఎన్నో విజయాలు సాధించామని అన్నారు. నవోదయలో ఆరవ తరగతి పరీక్షల ప్రవేశానికై పరీక్షలో పాల్గొనే విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఆన్లైన్ దరఖాస్తు ఆఖరి తేదీ : 13-08-2013 అని 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. నవోదయ ఎంట్రన్స్ పరీక్ష తేదీ :13-12-2025 న ఉంటుందని తెలిపారు. ది:02-08-2025వ తేదీ నుంచి విద్యార్థులకు సాయి ఎక్స్ లెంట్ స్కూల్లో నవోదయ శిక్షణ క్లాసులు ప్రారంభమవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రవేశ పరీక్షల్లో సీట్లు సాధించిన వారికి కార్పొరేట్ స్థాయిలో విద్య ఉంటుందని మరిన్ని వివరాల కోసం సాయి ఎక్సలెంట్ స్కూల్ 9441700094, 9440296832 కు కాల్ చేసి తెలుసుకోవచ్చు అన్నారు.

# చెట్లను నాటి వాటిని పరిరక్షిద్దాం.

*భావితరాలకు స్వేచ్ఛా వాయువును అందజేద్దాం : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్*

**కుత్బుల్లాపూర్ జూలై 31 (వార్తాప్రభ)** : కుత్బుల్లాపూర్ 127 - రంగారెడ్డి నగర్ డివిజన్ ఏ.పీ.హెచ్.బి కాలనీలోని జిహెచ్ఎంసీ పార్క్ - 1 లో ఏ.పీ.హెచ్.బి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అటవీశాఖ వారు ఏర్పాటుచేసిన వన మహోత్సవ కార్యక్రమానికి గురువారం బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై చెట్లను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... భావితరాలకు స్వేచ్ఛా వాయువును అందించేందుకు ప్రతీ ఒక్కరూ చెట్లను నాటడమే కాదు, వాటిని పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్, డీసీ నర్సింహా, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రఘువీర్ రెడ్డి, హార్టికల్చర్ యూబీడీ దివ్య, సీఐ నరసింహ రాజు, ఏ.పీ.హెచ్.బి కాలనీ వాసులు ఎర్వ సాయికిరణ్ (బంటి), భాష, జగన్, రత్తయ్య, రమణయ్య, సుధాకర్ రావు, వెంకట్ రెడ్డి, ఓం ప్రకాష్, స్థానిక



నాయకులు ఎర్వ శంకరయ్య, సుధాకర్, ఓంకార్ రెడ్డి, క్రాంతి యాదవ్, కార్తీక్ గౌడ్, సతీష్ గట్టోజీ, తారక రాణి, ఈశ్వరి, బాలు నేత, కొండ శ్రీను, గౌస్, అల్లావుద్దీన్, కిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యతా ప్రమాణాలు పాటించి అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయండి

**అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే గాంధీ**



**శేరిలింగంపల్లి,జూలై 31 (వార్తాప్రభ):**మియాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రి ఎనక్లేవ్ కాలనీ నుండి బొల్లారం మెయిన్ రోడ్డు వరకు రూ 1 కోటి 50 లక్షల రూపాయల అంచనావ్యయం తో నూతనంగా నిర్మాణం చేపట్టినటువంటి వరద నీటి కాలువ నిర్మాణం పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి పీఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు.ఈ సందర్భంగా పీఏసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ వరద ముంపు సమస్య శాశ్వత పరిష్కారం దిశగా 1.50 ఒక కోటి యాబై లక్షల రూపాయల నిధులతో వరద నీటి కాల్వ నిర్మాణం పనులను చేపట్టడం జరిగినదని,వరద నీరు కాల్వ నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేసి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడలని,రాబోయే వర్షాకాలం ను దృష్టిలో పెట్టుకొని పనులలో జాప్యం లేకుండా పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని,ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు,జాగ్రత్తలు తీసుకోవాలని పీఏసి చైర్మన్ గాంధీ అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు.త్వరలోనే వరద నీటి కాల్వ నిర్మాణం పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకువస్తామని,పనులు త్వరితగతిన చేపట్టాలని, పనులలో వేగవంతం పెంచాలని,పనుల విషయంలో అలసత్వం ప్రదర్శించకూడదని,పనుల నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని,నాణ్యత ప్రమాణాలు పాటించాలని,పీఏసి చైర్మన్ గాంధీ అధికారులకు తెలియచేసారు.వరద నీటి కాల్వ నిర్మాణం పనులు పై అధికారులకు పలు సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగినది. ఎన్నో ఏండ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయడం జరుగుతుంది అని , చుట్టుపక్కల కాలనీ వాసులకు ఎంతో మంది ప్రయాణికులకు, వాహనదారులకు సాంత్వన చేకూరునని పీఏసి చైర్మన్ గాంధీ తెలియచేశారు.శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని,ప్రజలకు అన్ని రకాల మౌళికవసతుల కల్పనకు కృషి చేస్తున్నాం అని,మౌళికవసతులు కల్పించడంలో ఎక్కడ ఎలాంటి సమస్య తలెత్తకుండా చూస్తున్నాం అని పీఏసి చైర్మన్ గాంధీ తెలియచేసారు.ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సునీత కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపిన కోల రవీందర్ ముదిరాజ్




**కుత్బుల్లాపూర్ జూలై 31 (వార్తాప్రభ)** : సింగల్ యూస్ ప్లాస్టిక్ నివారించడానికి ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ అన్నారు, రాష్ట్రంలో హైదరాబాదులో విచ్చలవిడిగా నాణ్యతలేని ప్లాస్టిక్ కవర్లు వాడడం వల్ల అట్టి కవర్లు ఇస్తరాకులు మోరీల్లో డ్రైనేజీల్లో వర్షం వచ్చినప్పుడు ప్లాస్టిక్ చెత్తతో నీళ్లు స్తంభించిపోతాయని, ప్లాస్టిక్ ని నివారిస్తే గోమాత, జలమత, బుమతాను, కాపాడినవారము అవుతాము, కావున దీనిపై నిర్ణయం తీసుకున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలపరుస్తూ ప్లాస్టిక్ తయారీదారులపై కఠిన నిర్ణయాలు తీసుకోవాలని కంపెనీ యజమానులకు జైలు శిక్ష విధించే విధంగా చట్టం తీసుకురావాలని కోరారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణమే కాకుండా ప్రజల ఆరోగ్యాలు చెడిపోయి క్యాన్సర్ వివిధ రోగాలకు గురి అవుతున్నారని ప్రముఖ డాక్టర్ నాగేశ్వరరావు చెప్పడం కూడా మనం పేపర్లో చదివే ఉన్నామని తెలిపారు. ఈ నిర్ణయానికి కట్టుబడి ఉండి ప్రజలను అవగాహన కల్పిస్తూ పాఠశాలల్లో మందిరాల వద్ద ప్లెక్సీలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి కో సూచించారు. దీనివలన గ్రామ రైతు లకు ఉపాది, మోదుగ, అరటి మొక్కలు, పెంచుతారని, దాని వలన పశువులకు దాన, పంటకు యేరువు, లభిస్తుందని అన్నారు.

# తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని శక్తిగా ఉంది

*కాంగ్రెస్ నేతలు నవీన్ యాదవ్, గొంటి విక్రమ్ యాదవ్*



**హైదరాబాద్ జూలై 31 :(వార్తా ప్రభ ప్రతినిధి):**తెలంగాణ లో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని శక్తి గా ఉందని, కాంగ్రెస్ పార్టీతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని నమ్మి భారీ మెజారిటీతో కాంగ్రెస్ పార్టీ నీ గెలిపించారని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఏఐసీసీ రాష్ట్ర ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ ప్రారంభించిన జనహిత పాదయాత్ర జయప్రదం కావాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకులు నవీన్ యాదవ్,తెలంగాణ రాష్ట్ర ఓబిసి డిపార్ట్మెంట్ జాయింట్ కోఆర్డినేటర్ గొంటివిక్రమ్ యాదవ్. ఆకాంక్షించారు. గురువారం రంగారెడ్డి జిల్లా పరిగిలో ప్రారంభమైన జనహిత పాదయాత్రకు మద్దతుగా నవీన్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర ఓబిసి డిపార్ట్మెంట్ జాయింట్ కోఆర్డినేటర్ గొంటివిక్రమ్ యాదవ్ వెళ్ళి రాష్ట్ర ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంట్లో బీసీ బిల్లు సైతం ఆమోదం పొందుతుందని ఆశాభావం వక్త చేశారు.

# వార్తా ప్రభ హైదరాబాద్

## పారిశుద్ధ కార్మికులకు వ్యక్తిగత రక్షణ పరికరాల పంపిణీ



**కుత్బుల్లాపూర్ జూలై 31 (వార్తాప్రభ)** : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధి కుత్బుల్లాపూర్ గ్రామం బీజేపీ కార్పొరేటర్ కార్యాలయం లో జిహెచ్ఎంసి అందిస్తున్న వ్యక్తిగత రక్షణ పరికరాలను (పీపీఈ కిట్లను) కుత్బుల్లాపూర్ సర్కిల్ 132 జీడిమెట్ల డివిజన్ పరిధి లో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులకు జిహెచ్ఎంసి వ్యక్తిగత పరికరాలను గురువారం స్థానిక కార్పొరేటర్ చెరుకుపల్లి తారా చంద్రారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమం లో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి,ఎ ఎం హెచ్ వో కవిత, డివిజన్ కి సంబందించిన ఎస్ ఎఫ్ ఏ లు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పారిశుద్ధ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుడి షెడ్డును కూల్చివేసి న మునిసిపాలిటీ అధికారులు

**అధికారులపై మండిపడుతున్న ప్రజలు**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కొత్తగూడెం టౌన్,కొత్తగూడెం పట్టణంలో పోస్ట్ ఆఫీస్ సెంటర్ నందు వికలాంగునికి చెందిన షెడ్ ను మునిసిపాలిటీ అధికారులు గురువారం నాడు తెల్లవారుజామున కూల్చివేశారు. గతంలో రైలు ప్రమాదానికి గురై అంగవైకల్యం తో ఇబ్బంది పడుతూ కుటుంబ పోషణ నిమిత్తమై పోస్ట్ ఆఫీస్ సెంటర్లోని సింగరేణి పాఠశాల సమీపంలో చిన్నపాటి అడ్డాను ఏర్పాటు చేసుకొని షెడ్డు వేసుకొని వికలాంగుడైన శ్రీనివాస్ చిరు వ్యాపారం సాగిస్తున్నాడు. అతని షెడ్డు నిర్మాణాన్ని కూల్చివేయడం సరైన చర్య కాదని వికలాంగులు అన్నారు. వికలాంగులపై అధికారులు జాలి ,దయ ,కరుణ ,అనేది లేకుండా వ్యవహరిస్తున్న అధికారుల తీరును పలువురు ఎండగట్టారు. అదే స్థలంలో శ్రీనివాస్ మరల తిరిగి షెడ్డు నిర్మించుకొనుటకు అధికారులు అనుమతి ఇవ్వాలని కోరారు

## వన మహోత్సవం లక్ష్యాలను పూర్తిగా సాధించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, జూలై 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)** భవిష్యత్తు తరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం- 2025 కార్యక్రమంలో జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను పూర్తిగా సాధించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



అన్నారు. గురువారం జిల్లాలోని చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్ లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో గీత కార్మికుల సంక్షేమంలో భాగంగా 400 తాటి మొక్కలు నాటడంతో పాటు గీత కార్మికులకు మొక్కలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తు తరాలకు సహజ సిద్ధమైన, సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మొక్కలు నాటే లక్ష్యాలను కేటాయించడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించడం బాధ్యతగా తీసుకోవాలని, ప్రజలు తమ ఇండ్లలో మొక్కలు నాటి పరిరక్షించాలని తెలిపారు. మండలంలోని పొక్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వన మహోత్సవంలో భాగంగా 200 మొక్కలు నాటారు. అనంతరం పాఠశాల పరిధిలో కూరగాయల మొక్కలను అభివృద్ధి చేసి తాజా కూరగాయలు పొందేందుకు ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్ను ప్రారంభించారు. పాఠశాలలోని వంటశాల, విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, హాజరు పట్టిక, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో నాణ్యమైన, పోషక విలువలు గల ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులను వివిధ సబ్జెకులలో పలు ప్రశ్నలు అడిగి వారి పఠనా సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని సాధించే దిశగా ఏకాగ్రతతో చదవాలని, ఉన్నత స్థానాలలో నిలువాలని అన్నారు.

# ఎడిటోరియల్

## మస్కబారుతున్న మానవ ఆత్మీయ సంబంధాలు

భర్త భార్యని చంపుతున్నాడుభార్య భర్తని చంపుతుంది,పిల్లలు తల్లిని చంపు తున్నారు, తల్లి పిల్లల్ని చంపుతుంది, కోడళ్ళు అత్తమామల్ని చంపు తున్నారు, అత్తమామలు కోడల్ని పొట్టన పెట్టు కుంటున్నారు, ఎందుకో మానవ సంబంధాలు మసక బారుతున్నాయి, ఎటు పోతుందో ఈ లోకం అందరు బాగుండాలి అందులో మీరు మీ కుటుంబ సభ్యులు మరీ బాగుండాలి !నిజమైన సంబంధాలు చేదు అవుతున్నాయి ఆన్లైన్ సంబంధాలు తీపి అవుతున్నాయి సామాజిక మాద్యమాలు విపరీత ప్రభావాలు చూపుతున్నాయి, మనుషుల్లో సిగ్గు తగ్గింది మనుషుల్లో మర్యాద తగ్గింది కుటుంబాల్లో గోప్యత తగ్గింది సంసారాలు వీధి కెక్కాయి, చీకటిలో ఉండాల్సినవి వెలుగులో కొచ్చాయి వెలుగులో ఉండాల్సినవి చీకటిలోకి వెళ్లాయి !నేటి ప్రాపంచిక మోజులో యువత విలువలు తగ్గించుకుంది భయం తగ్గించుకుంది బాధ్యత తగ్గించుకుంది బరితెగించడం అలవాటు చేసుకుంది, నేడు సమాజంలో అమ్మతనం అవమాన పడుతుంది కుటుంబ వ్యవస్థ మసక బారుతుంది పిల్లకి తల్లిదండ్రులు భారం అవుతున్నారు తల్లిదండ్రులకు పిల్లలు భారం అవుతున్నారు !టెక్నాలజీ పుణ్యమా అంటూ ప్రపంచం వింతపోకడలు పోతుంది పెరుగుట విరుగుట కొరకే అంటారు, మనుషుల్లో పెరుగుతున్న టెక్నాలజీ వాడకం మనిషిని ఎటువైపు తీసుకుపోతుందో అంతరించి పోతున్న ఆత్మీయతలు కనుమరుగు అవుతున్న ఆప్యాయతలు కానరాని బంధుత్వాలు కష్టం అనిపిస్తున్న బంధాలు అంతరించి పోతున్న మానం, మర్యాదలు ఎటు పోతుందో లోకం ఏమై పోతుందో మానవ జీవనం !!

## ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించిన తొండపు దశరథ జనార్ధన్



**జగ్గయ్యపేట జూలై 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, రాజకీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ మరియు జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ , తెలుగు సినీ పురుషుడిగా, నాయకుడిగా ప్రజాహృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు నందమూరి తారక రామారావు తనయుడు రామకృష్ణ కూడా పాల్గొన్నారు. ఎన్టీఆర్ ఆదర్శాలను, ప్రజల పట్ల ఉన్న నిబద్ధతను స్మరించుకుంటూ, వారిద్దరూ సంయుక్తంగా ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భం ప్రజల మధ్య ఎన్టీఆర్ పట్ల గల గౌరవాన్ని మరింతగా ప్రతిబింబించింది. దశరథ జనార్ధన్ ఎన్టీఆర్ సేవలను గుర్తుచేసుకుంటూ, తమ రాజకీయ ప్రేరణకు ఆయన జీవితం మార్గదర్శకమని పేర్కొన్నారు.

## మలాథిన్ టెక్నికల్ లిక్విడ్ పొగమందు పిచికారి

*గ్రామ సర్పంచ్ సాదుపాటి నాగమల్లేశ్వరి కోటేశ్వరరావు*



**విస్సన్నపేట జూలై 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక మండల కేంద్రంలో ఖల్నాయక్ బంకు ఏరియాలో గ్రామ సర్పంచ్ సాదుపాటి నాగమల్లేశ్వరి కోటేశ్వరరావు మలాథియన్ టెక్నికల్ లిక్విడ్ ఒక పిచ్చికారి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి కే శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ మందపాటి సత్యనారాయణ రెడ్డి,పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్ వి కుటుంబరావు వైసీపీ నాయకులు ఎస్ కోటేశ్వరరావు,వార్డ్ మెంబర్ ఎల్ పవన్ మరియు హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారులు-చిరు దివ్వెలు



పసి పిల్లల ముఖములు
రవిచంద్రుల వెలుగులు
వెన్నెల వన్నెల్లా
విరజిమ్మును సొగసులు
చిన్నారుల పలుకులు
జుంటితేనె ధారలు
అలతి అలతి పదములు
దోచుకొనును మనసులు
శుద్ధమైన తలపులు
భగవంతుని రూపులు
ముద్దులొలుకు పిల్లలు
ముద్దబంతి పూవులు
భారతమ్మ పుత్రులు
ప్రేమిస్తే మిత్రులు
అందరికీ ఇష్టులు
గుణంలోన శ్రేష్టులు
వెలుగులీను దివ్వెలు
విహరించే గువ్వలు
పూలలాంటి బాలలు
పరిమళించు మాలలు
మింటిలోన తారలు
ఇంటిలోన పిల్లలు
బహు అందము నవ్వులు
స్వచ్ఛమైన ప్రేమలు

**గద్వాల సోమన్న,**
9966414580

# జోజినగర్ ప్లాట్ల వారికి అన్యాయం చేస్తోంది కూటమి నాయకులే !

● షేక్ గౌస్ మొహిద్దీన్ వైసిపి సీనియర్ నాయకులు ● జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మెన్



**విజయవాడ పశ్చిమ జూలై 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జోజినగర్ 42 ప్లాట్ల యజమానులకు వ్యతిరేకంగా సొసైటీ పేరుతో కేసులు వేసి వారికి అన్యాయం చేస్తోంది కూటమి పార్టీలలోని నాయకులేనని,ఈ విషయాన్ని పక్కనపెట్టి,టిడిపి నాయకులు జలీల్ ఖాన్ తదితరులు వైసిపి పై దుష్ప్రచారం చేయడం దారుణమని వైసిపి సీనియర్ నేత,జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మెన్ షేక్ గౌస్ మొహిద్దీన్ విమర్శించారు.జోజినగర్ ప్లాట్ల యజమానులకు వ్యతిరేకంగా సొసైటీ పేరుతో కేసులు వేసి వారికి అన్యాయం చేస్తోంది కుటమి పార్టీల లోని కొంతమంది వ్యక్తులేనని ..ఇది వాస్తవం కాదా ? దీనికి ముందు కూటమి నాయకులు సమాధానం చెప్పాలని గౌస్ మొహిద్దీన్ డిమాండ్ చేశారు.దీనిలో వారి పాత్ర ఉందని ఇది అందరికీ తెలిసిన విషయమేనని దీన్ని విస్మరించి నిన్న జలీల్ ఖాన్ తదితరులు, వైసిపి కారణం అన్నట్లుగా మాట్లాడుతున్నారని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని గౌస్ మొహిద్దీన్ అన్నారు.టిడిపి నేతృత్వంలోని కుటమి ప్రభుత్వంలో తమ వారికి మేలు చేస్తూ ఉర్సా,లులు తదితర సంస్థలకు రాష్ట్రంలోని విశాఖలో,విజయవాడ లాంటి చోట్ల లో అతి తక్కువ ధరలకు భూములు పందారం చేసి లబ్ధి పొందుతున్నట్లు వైసిపి హయాంలో జరగలేదని గౌస్ మొహిద్దీన్ గుర్తు చేశారు.జోజినగర్ ప్లాట్ల యజమానులకు మద్దతుగా వైసిపి మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ తదితర నాయకులు వెళ్ళి వారికి సంఘీభావం ప్రకటించిన నేపథ్యంలో,నిన్న జలీల్ ఖాన్,ఎంఎల్ఏ కార్యాలయ కార్యదర్శి,తదితర కూటమి నాయకులు అక్కడికి వెళ్ళి మొసలి కన్నీరు కారుస్తున్నారని గౌస్ మొహిద్దీన్ విమర్శించారు.నిజంగా కూటమి నాయకులకు జోజి నగర్ ప్లాట్ల యజమానులకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి ఉంటే వారికి వ్యతిరేకంగా సొసైటీ పేరుతో ఎవరు కోర్టులకెక్కారో వెల్లడించాలని గౌస్ మొహిద్దీన్ డిమాండ్ చేశారు.వైసిపి పై లేని పోని విమర్శలు చేస్తూ మీడియా ముందు షో చేసే బదులు,ప్రభుత్వంలో మీరే ఉన్నారు కాబట్టి ప్లాట్ల యజమానులకు తక్షణం న్యాయం చేయాలని ఈ సంధర్భంగా గౌస్ మొహిద్దీన్ కూటమి నాయకులకు హితబోధ చేశారు.

# వరద ముంపు ప్రాంతాలపై పూర్తి అప్రమత్తంగా ఉన్నాం

**- క్షేత్రస్థాయిలో అందుబాటులో అధికారుల బృందాలు - వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం - ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదు - జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**





**ఇబ్రహీంపట్నం, జూలై 31(వార్తా ప్రభ ప్రతినిధి):**పులిచింతల నుంచి వరద నీరు నిలకడగా వస్తోందని.. దీంతో ప్రకాశం బ్యారేజ్ అన్ని గేట్లు పైకిఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్నామని, లోతట్టు ప్రాంతాలపై పూర్తి అప్రమత్తంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.కలెక్టర్ లక్ష్మీశ గురువారం అధికారులతో కలిసి ఇబ్రహీంపట్నం మండలంలో పర్యటించారు. చిన లంక, పెద్ద లంక, ఫెర్రీ తదితర ప్రాంతాలను సందర్శించి.. వరద ఉధృతి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ బ్యారేజీకి ఎగువన, దిగువన ఉన్న ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశామని.. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, పంచాయతీరాజ్, మునిసిపల్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండేలా ఆదేశాలిచ్చామన్నారు. గురువారం సాయంత్రం నాటికి వరద ఉధృతి మూడు లక్షల క్యూసెక్కులకు చేరుకునే అవకాశమున్నందున కృష్ణానది పరీవాహక ప్రాంతాల ప్రజలు వాగులు, వంకలు, కాలువలు వంటివి దాటే ప్రయత్నం చేయొద్దని.. చేపల వేటకు వెళ్లడం, పశువులు, గొర్రెలు, మేకలు వంటివాటిని వదలడం చేయొద్దని సూచించారు. నది వైపు వెళ్లకుండా పిల్లలను కూడా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. వరదకు సంబంధించి ప్రజల నుంచి సమస్యలను తెలుసుకునేందుకు, ఆ సమస్యల పరిష్కారానికి తక్షణం స్పందించి, క్షేత్రస్థాయిలో సమన్వయ శాఖల బృందాలను అప్రమత్తం చేసేందుకు జిల్లా కలెక్టరేట్‌లో 91549 70454 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని.. ఇది 24 గంటలూ పనిచేస్తుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు. వరద పరిస్థితిపై ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అయితే జాగ్రత్తగా ఉండాలని, అధికారులు, సిబ్బంది చేసిన సూచనలను పాటించాలని సూచించారు.కలెక్టర్ లక్ష్మీశ వెంట విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, కొండపల్లి మునిసిపల్ కమిషనర్ రమ్య కీర్తన తదితరులు ఉన్నారు.

# నిబద్ధతకు మారుపేరు "ఉమ్మడిశెట్టి "





**విజయవాడ పశ్చిమ, జులై 31:(వార్తా ప్రభ ప్రతినిధి)** నిర్దిష్ట ప్రణాళికతో విద్యార్థులకు విద్యా బోధన చేస్తూ నిబద్ధతకు మారుపేరుగా ఎస్ కే పి వి హిందూ హై స్కూల్స్ గణిత శాస్త్ర ఉపాధ్యాయులు ఉమ్మడిశెట్టి వెంకటేశ్వరరావు నిలిచారని ఎస్ కే పి వి ఇందు హై స్కూల్స్ కమిటీ కార్యదర్శి కె ఎల్ వి మోహన్ రావు కొనియాడారు. 36 సంవత్సరాలుగా గణిత శాస్త్ర ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహించిన ఉమ్మడిశెట్టి వెంకటేశ్వరరావు పదవీ విరమణ కార్యక్రమం హిందూ హైస్కూల్ ఆవరణలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మోహన్ రావు హిందూ హై స్కూల్స్ కమిటీ ఉపాధ్యక్షులు అన్నం రామకృష్ణారావు, కేబీఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ తూనికుంట్ల శ్రీనివాస్ లతో కలిసి తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కమిటీ ఉపాధ్యక్షులు అన్నం రామకృష్ణారావు మాట్లాడుతూ హిందూ హైస్కూల్ కు సుమారు 125 ఏళ్ళ ఘనచరిత్రలో వేలాదిమంది విద్యార్థులను ఉన్నత స్థానంలో నిలబెట్టిన గురుతుల్యులు ఉండటం పాఠశాల గర్వకారణం అన్నారు. ఉమ్మడిశెట్టి వెంకటేశ్వరరావు గత 36 సంవత్సరాలుగా విద్యా సేవలో తరించి ఆదర్శప్రాయంగా నిలిచారని చెప్పారు. కేబీఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ తూనికుంట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ హిందూ హై స్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న అన్ని ఇన్స్టిట్యూషన్స్లో నిబద్ధత అంకిత భావంతో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు ఉండటంతో పాటు, ఆధ్యాత్మిక, ఆరోగ్య, సేవా సంబంధిత ప్రత్యేక కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉద్యోగ విరమణ చేస్తున్న యు వెంకటేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ కే పి వి వి హిందూ హైస్కూల్ కమిటీ అడ్మినిస్ట్రేషన్ అధికారి డాక్టర్ వి. నారాయణ రావు, కేబిఎన్ కళాశాల ఎగ్జిక్యూటివ్ అధికారి ఎన్. శ్రీనివాసరావు, హిందూ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కంచర్ల శ్రీనివాసరావు, అసిస్టెంట్ ప్రధానోపాధ్యాయుడు ఎస్. భరత్ కుమార్, ఉపాధ్యాయుల ప్రతినిధి బ్రహ్మేశ్వర రావు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రికార్డులు పరిశీలించి న్యాయం చేయండి - బాధితుల విజ్ఞప్తి



**కనిగిరి జులై 31 వార్తా ప్రభ ప్రతినిధి**కనిగిరి నియోజకవర్గం పామూరు మండలంలోని తూర్పు కోడిగుడ్లపాడు గ్రామంలో ప్రభుత్వ భూములపై వివాదాలు చెలరేగాయి. సర్వే నంబరు 110లో ప్రభుత్వం అప్పట్లో పంపిణీ చేసిన భూములకు సంబంధించి తమకు పూర్తి అధికారాలు ఉన్నాయని, ఆయా రికార్డులను పరిశీలించి న్యాయం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.గ్రామస్తులైన తిరువీధి విజయలక్ష్మి, దారపనేని తిరుపతమ్మలుకు 1987లో కనిగిరి అసైన్మెంట్ కమిటీ మా పేర్లపై భూములు మంజూరు చేసిందన్నారు. ఒక్కొక్కరికి ఐదు ఎకరాల చొప్పున పథకం కింద పంపిణీ జరిగింది. ఇందుకు సంబంధించి వన్ బి, అడంగల్, 1ఎ, డీకే రిజిస్టరు, మాన్యువల్ అడంగల్, డిజిటల్ అడంగల్ వంటి ప్రభుత్వ పత్రాలలో మాకు సంబంధించిన వివరాలన్నీ స్పష్టంగా ఉన్నాయి. కానీ మా కుటుంబ యజమానులు మరణించిన తరువాత కొంతమంది వ్యక్తులు భూమిపై ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు.ఇటీవల మేమే దుక్కులు దున్ని సాగు చేశాం. భూమి మనదేనని చెబుతూ మేము సాక్ష్యాధారాలతో ఉన్నా కూడా, కొందరు వ్యక్తిగత కక్షలతో సమస్యలు సృష్టిస్తున్నారు. ప్రభుత్వమే మంజూరు చేసిన భూములకు ఇప్పుడు మాకు సమస్యలు ఎదురవుతుండడం బాధాకరం అని వారు వాపోయారు.ఈ విషయంపై తహసిల్దార్ రామచంద్రుని వాసుదేవరావు స్పందిస్తూ సంబంధిత ప్రభుత్వ పత్రాలను పూర్తిగా పరిశీలించి ఎవరి హక్కు వారికి తీసుకురావడానికి అవసరమైన చర్యలు తప్పకుండా తీసుకుంటాం అని భరోసా ఇచ్చారు.

# దోమల నివారణతోనే డెంగ్యూ నిర్మూలన

-జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి కె. విజయలక్ష్మి



**మంగళగిరి:జూలై 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)**దోమల నివారణతో డెంగ్యూ వ్యాధి నిర్మూలన సాధ్యమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కె.విజయలక్ష్మి పేర్కొన్నారు. జాతీయ డెంగ్యూ మహోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం నగరంలోని ఎంపీడీవో కార్యాలయం తెనాలి రోడ్డు వరకూ నిర్మలా ఫార్మసీ విద్యార్థులతో కలిసి ఆరోగ్య సిబ్బందిర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కె విజయలక్ష్మి మాట్లాడుతూ... దోమ కుట్టడం వలన డెంగ్యూ జ్వరం వస్తుందని తెలిపారు. ప్రతిఒక్కరూ దోమతెరలను వాడాలన్నారు. డెంగ్యూ లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు. ఇంటిలో వినియోగించని పాత్రల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, పూలకుండీలు, ఫ్రిజ్లో నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మలేరియా అధికారి టిఎంకే సుబ్బరాయణం, ఏఎంఓ రాజు నాయక్, ఇందిరానగర్ మార్కండేయ కాలనీ వైద్యాధికారులు డాక్టర్ పి.అనూష, డాక్టర్ సతీష్, నిర్మల ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రేఖా నరేష్ బాబు, స్టూడెంట్స్ కోఆర్డినేటర్స్ జి.రాజ రాజేశ్వరి, ఎన్. సుష్మ, ఎస్ యుఓ లు కె.రామరాజు, సుధీర్, సూపర్వైజర్లు సాగర్, సైదులు తో పాటు పలువురు హెల్త్ అసిస్టెంట్లు, హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు, పలువురు జాతీయ సేవా పథకం విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపలోకాయుక్త చొరవతో రైతుకు రూ.20,11,645/-లు పరిహారం చెల్లింపు.

**విజయవాడ, జూలై 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రకాశం జిల్లా, సి.యస్ పురం మండలం, ముసునూరు గ్రామానికి సంబంధించిన భూసేకరణ పరిహారం విషయంలో ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త సంస్థ కీలక పాత్ర పోషించింది.బెంగులూరు-కడప-విజయవాడ ఆర్థిక కారిడార్ (ఎన్. హెచ్-554జీ) కోసం నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా సేకరించిన ఎ.1.72 సెంట్లు భూమికి పరిహారం చెల్లించలేదని, ప్రకాశం జిల్లా కలెక్టరు మరియు ప్రత్యేక జిల్లా కలెక్టరు (భూసేకరణ) చర్యల తీసుకోలేదని ఫిర్యాదిదారుడు పి.ఓం శివయ్య ఫిర్యాదు నెం.1558/2023/బి1 ద్వారా లోకాయుక్త సంస్థ నందు ఆరోపించారు. అంతేకాక సదరు భూమిని పట్టా భూమిగా నిర్ధారిస్తూ, జిల్లా కలెక్టరు మరియు ప్రత్యేక జిల్లా కలెక్టరు (భూసేకరణ) నష్టపరిహారం కోసం చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఉప లోకాయుక్త శ్రీమతి పి.రజని గారి ఆదేశాల నేపథ్యంలో జిల్లా కలెక్టరు, మరియు ప్రత్యేక జిల్లా కలెక్టరు (భూసేకరణ) సమగ్ర నివేదికలు సమర్పించారు. అందులో సదరు భూమి ప్రైవేట్ పట్టాభూమిగా గుర్తించబడిందని, నిషేధిత జాబితా నుండి తొలగించామని పేర్కొన్నారు. రెవెన్యూ రికార్డులలో తహశీల్దార్ అవసరమైన మార్పులు చేసారు. అనంతరం ఫిర్యాదిదారుడు ఓం శివయ్యకు ప్రాజెక్టు డైరెక్టర్, ఎన్ హెచ్ ఏ ఐ వారి ద్వారా రూ.20,11,645/-లు భూమి నష్టపరిహారంగా చెల్లించారు. ఫిర్యాదిదారుడు పూర్తి సరిహారం అందుకున్నట్లు ధ్రువీకరించి కేసు ముగింపుకు ఎటువంటి అభ్యంతరం లేదని చెప్పడంతో ఈ ఫిర్యాదు మూసివేయబడిందనీ ఆంధ్రప్రదేశ్ లోకయుక్త మరియు ఉప లోకాయుక్త రిజిస్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## చిత్తలూరులో సివిల్ రైట్స్ డే కార్యక్రమం



**చేజర్ల జూలై 31 (వార్తాప్రభ)** పౌర హక్కుల గురించి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి నెల చివరి రోజున సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగా గురువారం మండలంలోని చిత్తలూరు గ్రామంలో చేజర్ల తహశీల్దారు బి.మురళి ఆధ్వర్యంలో పౌరహక్కుల గురించి గ్రామస్తులకు వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వివరించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ సతీష్ మరియు గ్రామస్తులతోపాటు గ్రామ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## చిట్టినేని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన



**ఆగిరిపల్లి,జూలై 31( వార్తా ప్రభ):** ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండల పరిధిలో ఈదుల గూడెం గ్రామానికి చెందిన నూజివీడు నియోజకవర్గ మాజీ రైతు సంఘం అధ్యక్షులు చిట్టినేని శివరామకృష్ణ తండ్రిగారైన చిట్టినేని హనుమంతరావు అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకుని తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ముద్ర బోయిన వెంకటేశ్వరరావు వారి కుటుంబాన్ని పరామర్శించి, హనుమంతరావు కి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నక్కన బోయిన వేణు, మదుపల్లి గోపాల్,కొండా మంగయ్య మరియు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

**-రాజధాని రైతుకూలీ పింఛన్ల పునరుద్ధరణ**
**-హర్షం వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు, అంగన్ వాడీలు, ఆశా కార్యకర్తలు**

**మంగళగిరి: జూలై 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది. రాజధాని గ్రామాల్లో పారిశుధ్య కార్మికులకు అంగన్వాడీ కార్యకర్తలకు, ఆశా వర్కర్లకు రాజధాని రైతు కూలీ పింఛన్లను పునరుద్ధరించింది. దీంతో వారు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ లకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. అమరావతి రాజధాని తొలి నాళ్లలో ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం రాజధాని గ్రామాల్లో రైతు కూలీలు, భూమిలేని పేదలకు ప్రతి నెలా రూ.2,500 ల చొప్పున పంపిణీ చేసింది. అదే క్రమంలో రాజధాని గ్రామాల్లోని పారిశుధ్య కార్మికులకు, అంగన్వాడీలకు ఆశా కార్యకర్తలకు సైతం రాజధాని రైతు కూలీ పింఛన్లను పంపిణీ చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అధికారం చేపట్టిన వైకాపా ప్రభుత్వం రాజధాని ప్రాంతంలోని పారిశుధ్య కార్మికులకు, ఆశాలకు అంగన్వాడీలకు రాజధాని రైతు కూలీ పింఛన్లను నిలిపివేసింది. దీంతో వారు పలుమార్లు తమ సమస్యను నేతల దృష్టికి తీసుకువెళ్లినా రైతు కూలీ పింఛన్లను మాత్రం పునరుద్ధరించలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో తిరిగి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం





పారిశుధ్య కార్మికులకు, అంగనవాడీలకు, ఆశా కార్యకర్తలకు వైకాపా ప్రభుత్వ హయాంలో తొలగించిన రైతు కూలీ పింఛన్లను తిరిగి పునరుద్ధరించింది. ఆగస్టు 1వ తేదీన వీరందరూ రూ.ఐదువేల చొప్పున రైతు కూలీ పింఛన్లు అందుకోనున్నారు. కాగా సాంకేతిక కారణాలవల్ల కొందరి పారిశుధ్య కార్మికులకు, ఆశాలకు అంగన్వాడీలకు రైతు కూలీ పింఛన్ పునరుద్ధరణ కాలేదని, పరిశీలించి వారికి కూడా వీలైనంత త్వరలోనే రైతు కూలీ పింఛన్లను మంజూరు చేయనున్నట్లు సీఆర్డీఏ అధికారులు తెలిపారు.

**పింఛను పునరుద్ధరణ అనుమతి పత్రాల అందజేత.** మంగళగిరి - తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధి యర్రబాలెం ఒకటవ సచివాలయంలో గురువారం పారిశుధ్య కార్మికులకు, ఆశాలకు అంగన్వాడీలకు రాజధాని రైతు కూలీ పింఛన్లు, వితంతువుల పెన్షన్ల పునరుద్ధరణకు సంబంధించిన అనుమతి మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆకుల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టకుందని, వైకాపా ప్రభుత్వ హయాంలో తొలగించిన రాజధాని రైతు కూలీ పింఛన్లను తిరిగి పునరుద్ధరించిందన్నారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొంతమంది పింఛన్లు పునరుద్ధరణ కాలేదని, వారికి కూడా వీలైనంత త్వరితగతిన పింఛన్లను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నీలం అంకారావు, ఆకుల పానకాలరావు, గడదాసు రంగారావు, ఫిరోజ్ ఖాన్, సాలి నరేష్, చింతా జగన్, మిరియాల సత్యనారాయణ, తోట సురేష్ , అప్పల శాంతి, జన సేన పార్టీ నాయకులు ఆకుల అజయ్ బాబు, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదు

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం ఆదేశాలు**




**విజయవాడ పశ్చిమ జూలై 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నగరంలో పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం అన్నారు. గురువారం ఉదయం తన పర్యటనలో భాగంగా కృష్ణలంక, సామిల్ రోడ్డు, పోస్ట్ ఆఫీస్ రోడ్డు, వెంకటరెడ్డి స్కూల్ రోడ్డు, కృష్ణలంక సర్వీస్ రోడ్డు పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.కృష్ణలంకలో పారిశుధ్య నిర్వహణ చేస్తున్న కార్మికులతో మాట్లాడి వారికి పనిముట్లు సరైనవి, ఉన్నాయా లేవా, తోపుడు బళ్ళు సరిపడ ఉన్నాయా లేవా, వ్యర్థ సేకరణలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, ప్రతిరోజు రోడ్లు పరిశుభ్రపరుస్తున్నారా లేదా, డ్రైన్లలో వ్యర్థాలు తొలగిస్తున్నారా లేదా వంటి విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని వ్యర్థాల సేకరణలో ఏమైనా ఇబ్బందులు ఉంటే, వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, నగర పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా ఉండాలని, స్వచ్ఛ సర్వేక్షన్ లో ఉన్నత స్థాయిని నిలబెట్టుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులు అందుకు అనుగుణంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆదేశించారు.

## వేద విద్యార్థుల సేవలు సమాజానికి అందేలా చర్యలు- ఈవో శీనా నాయక్



**విజయవాడ పశ్చిమ జూలై 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) వి.కె. సీనా నాయక్ గురువారం విజయవాడలోని పోరంకిలో ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర వేద విద్యాలయం (వేద పాఠశాల)ను సమగ్రంగా తనిఖీ చేశారు. సమాజహితం కోరే వేద విద్యార్థులకు అత్యుత్తమ భోధన అందించి, భవిష్యత్ తరాలకు వేదముల సారాంశాన్ని అందించడానికి శ్రీ కనకదుర్గ అమ్మ వారి దేవస్థానం కట్టుబడి ఉందని ఈవో శీనా నాయక్ అన్నారు.గురు వారం మధ్యాహ్నం ఆకస్మికంగా దేవస్థానం వేద పాఠశాల సందర్శించి, అక్కడ పరిస్థితి గమనించారు.విద్యార్థులకు పాఠాలు అర్థం అవుతున్నాయా, గురువులు భోధించిన పాఠాల వివరాలు తెలుసుకున్నారు.విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టీ పరిశీలించి, సంతకం చేశారు.విద్యార్థులను చూడటానికి వచ్చిన తల్లిదండ్రులతో మాట్లాడి, సౌకర్యాలు గురించి తెలుసుకున్నారు.విద్యార్థులకు కావలసిన పుస్తకాలు, సౌకర్యాలు తక్షణమే ఏర్పాటు చేయవలసినదిగా సిబ్బందిని ఆదేశించారు.

## గ్రామంలో క్షుద్ర పూజలు కలకలం

**అశ్వారావుపేట,జూలై 31 :(వార్తా ప్రభ ప్రతినిధి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం లచ్చాపురం గ్రామంలో క్షుద్ర పూజలు కలకలం రేపుతుంది. రాత్రంతా ప్రశాంతంగా ఉన్న గ్రామంలో తెల్లారేసరికి మూడు రోడ్ల కూడలి మధ్యలో క్షుద్ర పూజలు చేసిన వస్తువులు ప్రత్యక్షమయ్యాయి. వాటిని గమనించిన స్థానికులు హడలిపోతున్నారు. నాగ పంచమి రోజున అతీత శక్తుల కోసం క్షుద్ర పూజలు చేసి ఉంటారని కొంతమంది భావిస్తుంటే, ఎవరి మీద అయినా కక్షతోనో లేక ఆధిపత్యం కోసమో ఈ పూజలు జరిగి ఉండొచ్చని మరికొందరు అనుకుంటున్నారు.

## కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతులకు 2025-2026 ఆర్థిక సంవత్స తొలి విడత బోనస్ రూ 13 కోట్లు చెల్లింపు నిర్ణయం

***రాబోయే ఆర్థిక సంవత్సరానికి దేశం లోనే ముందస్తు బోనస్ చెల్లించే ఏకైక సహకార సంస్థ కృష్ణా మిల్క్ యూనియనే***
***కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు***



**విజయవాడ పశ్చిమ జూలై 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)** బారత దేశంలోనే కృష్ణా మిల్క్ యూనియన్ ఒక్కటే పాడి రైతులకు రాబోయే ఆర్థిక సంవత్సర బోనస్ ముందుగానే ఇస్తుందని చైర్మన్ చలసాని ఆంజనేయులు గర్వంగా చెప్పారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం జరిగిన పాలక వర్గ సమావేశములో సమితి పాడి రైతులకు 2025-26 ఆర్థిక సంవత్సరమునకు గాను మొదటి విడత బోనస్ (ఏప్రిల్ -25 నుండి జూలై - 25 వరకు) సుమారు 13 కోట్ల రూపాయలను పాడి రైతులకు ఆగష్టు మాసములో చెల్లించుటకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతులకు అత్యధిక ధర చెల్లించడం తో పాటుగా క్రమం తప్పకుండా బోనస్ చెల్లిస్తున్న ఏకైక సహకార సంస్థ కృష్ణా మిల్క్ యూనియన్ అని తెలిపారు.ఈ సందర్భముగా చైర్మన్ మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజనరీ పి4 కార్యక్రమం స్ఫూర్తిగా, కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతులను ఆదుకునేందుకు అంకితభావంతో పనిచేస్తోందని తెలిపారు. ఈ క్రమంలో, ప్రభుత్వ పథకంలో భాగంగా సరఫరా చేసే సెక్స్ సార్టెడ్ సెమెన్ డోస్ కు ధర రూ.150 కాగా, ఉమ్మడి కృష్ణా జిల్లా లో పాడి రైతులకు కేవలం రూ.50కి మాత్రమే అందించి, మిగిలిన రూ.100 సబ్సిడీ పై కృష్ణా మిల్క్ యూనియన్ భరిస్తుందని తెలిపారు. ఈ చర్య భవిష్యత్తులో పాడి రైతుల ఉత్పాదకతను పెంచి, స్థిరమైన గ్రామీణ జీవికను నిర్ధారించడంలో సహాయపడుతూ, వారి ఆర్థిక స్థితిగతుల పరిపుష్టికి మార్గం సుగమం చేస్తుందని మేము గట్టిగా విశ్వసిస్తున్నామని తెలిపారు. ఇది గౌరవనీయ సీఎం పి 4 కార్యక్రమ లక్ష్యాలతో పూర్తిగా అనుసంధానమై ఉంటుంది. అలాగే ముఖ్యమంత్రి ప్రతిపాదించిన పశువుల హాస్టల్స్ ను అవనిగడ్డ పరిధిలోని పెదకళ్ళేపల్లి గ్రామంలో మరియు నందిగామ పరిధిలోని మునగచెర్ల గ్రామంలో త్వరలోనే ప్రారంభిస్తునట్లు గా తెలిపారు. ఈ సందర్భముగా డిస్ట్రిక్ట్ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కేవలం కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతులకే కాకుండా ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పాడి రైతులు అందరికి సబ్సిడీ పై సెక్స్ సార్టెడ్ సెమెన్ ను అందించడం హర్షణీయమని, ఈ నిర్ణయం తీసుకున్న కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు కి మరియు పాలక వర్గం కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ చర్యల వల్ల రానున్న మూడునాలుగు సంవత్సరాలలో ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో పాల దిగుబడి గణనీయంగా పెరుగుతుందని ప్రగాడ విశ్వాసం తెలియజేసారు. కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతుల ఆరోగ్య పరిరక్షణకు ఆశ్రం హాస్పిటల్, ఏలూరు మరియు పిన్నమనేని సిద్ధార్థ స్పెషాలిటీ %ഥ% సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, చిన్న ఆవుటపల్లి వారితో భాగస్వామ్యంతో కృష్ణా మిల్క్ యూనియన్ పరిధిలోని పాడి రైతులకు తక్కువ ఖర్చుతో అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని సంకల్పించామని తెలిపారు. ప్రముఖ హాస్పిటల్స్ అయిన ఆశ్రమం హాస్పిటల్, ఏలూరు మరియు పిన్నమనేని సిద్ధార్థ స్పెషాలిటీ %ഥ% సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, చిన్న ఆవుటపల్లి నందు యూనియన్ పాడి రైతులకు రాయితీ ధరలకే వైద్య సేవలు పొందే అవకాశం కలుగనుంది. ఈ వైద్య సదుపాయాన్ని ఉమ్మడి కృష్ణా మరియు పశ్చిమ గోదావరి జిల్లా పాడి రైతులు వినియోగించుకొని తమ కుటుంబ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ గారు విజ్ఞప్తి చేసారు.ఈ సందర్భంగా ఆశ్రం హాస్పటల్ సీఈవో హనుమంతరావు, పిన్నమనేని హాస్పిటల్స్ సూపరింటెండెంట్ అనిల్ మాట్లాడుతూ కృష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గం వారి కోరిక మేరకు కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతులకు రాయితీ పై వైద్య సేవలు అందించటానికి అంగీకారం తెలిపామని, దీర్ఘకాలికంగా ఈ వైద్య సేవలను పాడి రైతులకు అందిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర బాబు, బోర్డు డైరెక్టర్స్ పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు మరియు సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు

- సుదీర్ఘ కాలం క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి, పదవి వీరమణ పొందడం అభినందనీయం.
- ఇన్ని ఏళ్ళు చట్టాలకు అనుగుణంగా విధులు నిర్వహించారు, మనమంతా ఒకే పోలీసు కుటుంబం.
- పోలీసు డిపార్ట్మెంట్ లో ప్రజా సేవకే మీ సమయం, శక్తి అన్ని వినియోగించినందుకు డిపార్ట్మెంట్ తరపున ధన్యవాదాలు....
- డిప్యూటీ పోలీసు కమిషనర్ శ్రీమతి కె.జి.వి.సరిత ఐ.పి.ఎస్.







**విజయవాడ పశ్చిమ జూలై 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎన్.టి.ఆర్.జిల్లా నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి, కర్తవ్య నిర్వహణలో చిత్తశుద్ధి, అంకిత భావంతో పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు విశిష్ట సేవలందించిన వారికి ఘనంగా సత్కరించారు. గురువారం పదవీ విరమణ చేసిన ఆరుగురు పోలీస్ అధికారులను పోలీస్ కమీషనర్ వారి కార్యాలయం లో పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు అడ్మిన్ డి.సి.పి. శ్రీమతి కె.జి.వి. సరిత , ఇతర పోలీస్ అధికారులతో కలిసి సుదీర్ఘకాలం పాటు పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించినందుకు గాను పదవీ విరమణ చేసిన అధికారులను అభినందించి పోలీస్ మర్యాదలతో శాలువాలతో సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. పదవీవిరమణ పొందిన వారిలో వై.నాగరాజు సబ్ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు సి.సి.ఆర్.బి, ఎం.జి.అబ్బాన్ అస్సిస్టెంట్ సబ్ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు మహిళా పి.ఎస్., వై.సాయి బాబు అస్సిస్టెంట్ రిజర్వ్ సబ్ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు సి.ఏ.ఆర్,పి. రమేష్ పోలీస్ ం కానిస్టేబుల్ పటమట, ఎస్.వెంకట రావు హోంగార్డు హోంగార్డు యూనిట్ బి.దుర్గా దేవి ,హిళా హోంగార్డు హోంగార్డు యూనిట్ లున్నారు. ఈ సంధర్భంగా అడ్మిన్ డి.సి.పి. మాట్లాడుతూ... పదవీ విరమణ చేస్తున్న అధికారులంధరికి వారి కుటుంబ సభ్యులకు ధన్యవాధములు తెలియజేశారు. ఈ నేపధ్యంలో ప్రతి ఒక్క అధికారిని మరియు వారి కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించి వారి యోగక్షేమాల గురించి తెలుసుకున్నారు. పధవీ విరమణ చేసిన అధికారులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు 24 గంటలూ ఉద్యోగ విధి నిర్వహణలో బాగంగా చాలా బిజీగా గడిపారు. ఇప్పటి నుండి ఒక్కసారిగా ఖాళీ అయితే చాలా ఇబ్బందిగా ఉంటుంది కనుక అధ్యాత్మిక పరంగా వెళ్లడమో లేధా ఏదో ఒక వ్యాపకం చూసుకోవాలని అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని తెలియజేశారు.అనంతరం పదవీ విరమణ చేసిన అధికారులను అభినందించి పోలీస్ మర్యాదలతో శాలువాలతో సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డి.సి.పి.శ్రీమతి కె.జి.వి.సరిత ఐ. పి. ఎస్., క్రైమ్ డి.సి.పి. కె. తిరుమలేశ్వర రెడ్డి ఐ.పి.ఎస్, ఎ. ఓ. శ్రీమతి సునీత , ఆర్.ఐ. సురేష్ రెడ్డి , ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ ఎం. సోమయ్య, అసోసియేషన్ సంఘ సభ్యులు మరియు అధికారులు, సి.పి.ఓ. సిబ్బంది, పోలీస్ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## వధువరులకు మంగళసూత్రం అందజేసిన రామినేని రాజా



**ఇబ్రహీంపట్నం, జూలై 31(వార్తా ప్రభ ప్రతినిధి):**తమను నమ్ముకున్న ఆప్తులకు అన్నలా ఎప్పుడు అండగా ఉంటానని నిరూపిస్తూ,పార్టీ నాయకుడి కుమారుడి వివాహం సందర్భంగా నూతన వధూవరులకు మంగళసూత్రం మరియు పెళ్లి వస్త్రాలు అందించి తన సహృదయం చాటుకున్నారు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రామినేని రాజా.మండల పరిధిలోని జూపూడి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు రెంటపల్లి చిట్టిబాబు కుమారుడి వివాహం సందర్భంగా నూతన వధూవరులకు మంగళసూత్రం మరియు పట్టు వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వధూవరులు మేళ తాళాలతో, సాంప్రదాయబద్ధంగా రాజా ఇంటికి వచ్చి మంగళ సూత్రాలు అందుకున్నారు. వారికి ఘన స్వాగతం పలికి సాంప్రదాయం ప్రకారం వధువుకు వాటిని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఎన్నో వివాహ మహోత్సవాలకు రాజా దంపతులు మంగళ సూత్రాలు అందించారని, వారి చేతి మీద సారె తీసుకోవడం శుభం గా భావిస్తామని తెలిపారు. తమకు ఎప్పుడు ఒక అన్న లాగా రాజా ఆత్మీయత కలిసి కనబరుస్తూ అండగా నిలుస్తారని,రాజా దంపతులకు ఎప్పుడూ మంచి జరగాలని ఆశీర్వచనాలు అందజేశారు.

## బాడిత వాసు దేవరావు దశదినకర్మలో పాల్గొన్న ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్



**విజయవాడ పశ్చిమ జూలై 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జనసేన సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్, సోదరుడు బాడిత వాసు దేవరావు దశ దిన కర్మ భవాని పురం,పున్నమి ఘాట్ లోని ఫంక్షన్ హాల్ లో గురువారం నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ బాడిత వాసుదేవరావుదశదినకర్మ లో పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బాడిత వాసుదేవరావు వన్ టౌన్ లోని పాత శివాలయం ఆలయ చైర్మన్ గా గతంలో సేవలందించారు.బీజేపీ, జనసేన, టీడీపీ శ్రేణులు , పలువురు ప్రముఖులు , శ్రేయోభిలాషులు పాల్గొని ఆయన చేసిన సేవలను కొనియాడారు..

## తుమ్మల బాపయ్య విద్యార్థులకు రోల్ మోడల్ : యార్లగడ్డ



**గన్నవరం : జూలై 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తనతోపాటు ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారి ఉన్నతికి కారణమైన రిటైర్డ్ లెక్చరర్ తుమ్మల బాపయ్య విద్యార్థులకు రోల్ మోడల్ అని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కొనియాడారు. తుమ్మల బాపయ్య సంస్మరణ కార్యక్రమం విజయవాడలోని ఫన్ టైం క్లబ్ లో గురువారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన యార్లగడ్డ తుమ్మల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ రసాయనశాస్త్రాన్ని చాలా చక్కగా అర్థమయ్యే రీతిలో బోధించేవారు అని గుర్తు చేసుకున్నారు. విద్యార్థుల సందేహాలను విడమర్చి చెప్పే వారని ఆయన బోధన వల్ల విద్యార్థులకు రసాయన శాస్త్రం అంటే ఆసక్తి కలిగేదని చెప్పారు. తుమ్మల లేరన్న నిజాన్ని జీర్ణించుకోవడం కష్టంగా ఉందని పేర్కొన్న ఆయన బాపయ్య కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## దేశ సరిహద్దులు తలపించిన నెల్లూరు

**నెల్లూరు జూలై 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మాజీ ముఖ్యమంత్రి జగన్ నెల్లూరు పర్యటన సందర్భంగా అడుగడుగునా పోలీసు నిఘా, ముళ్లకంచెలు,బారికేడ్లు, ప్రత్యేక పోలీసు బృందాలతో చెక్ పోస్టులు ఏర్పాటు చేసారు. రెండు నెలలుగా జిల్లా కేంద్ర కారాగారం లో ఉన్న మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డితో జగ్ ములాఖాత్, కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి ఇంటికి వెళ్ళనున్నారు ఈ నేపథ్యంలో జగన్ చూసేందుకు భారీ ఎత్తున అభిమానులు పార్టీ శ్రేణులు హాజరయ్యే అవకాశం ఉండడంతో పోలీసులు వారిని అడ్డుకునేందుకు భారీ ఎత్తున పోలీసు బలగాలను మోహరించారు జిల్లాలో ఇప్పటికే అన్ని పోలీస్ స్టేషన్లో పరిధిలో జన సమీకరణ చేయొద్దు జగన్ పర్యటనకు ప్రజలకు ఎటువంటి అనుమతి లేదని అలా కాదుని ఎవరైనా జగన్ ను చూడాలని వచ్చినా బైక్ ర్యాలీలు చేసినా పోస్టర్లు బ్యానర్లు లాంటివి ప్రదర్శించినా కఠినంగా వ్యవహరిస్తామని కేసులు నమోదు చేస్తామని నోటీసులు జారీచేశారు, ఇప్పటికే నెల్లూరు నగరం లో ప్రవేశించే అన్ని మార్గాల వద్ద పోలీస్ చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి బయట వ్యక్తుల వాళ్ళు నగరంలోకి ప్రవేశించకుండా అడ్డుకుంటున్నారు, నగరంలో కూడా పలు కూడళు ళ్ల వద్ద బారికేడ్లు పెట్టి ముళ్ళ కంచ ఏర్పాట్లు చేశారు...

# వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో సింగపూర్ రూ.45వేల కోట్ల పెట్టుబడులు!

- చంద్రబాబు గారి నేతృత్వంలో సింగపూర్ పర్యటన విజయవంతం
- రికార్డులను సరిచేయడానికి సింగపూర్ పర్యటనకు వెళ్లాం
- పెట్టుబడులను అడ్డుకునేందుకు తప్పుడు ఈ-మెయిల్స్ పెట్టించారు
- గత పదేళ్లలో వచ్చిన పెట్టుబడులకంటే 14నెలల్లో వచ్చిందే ఎక్కువ
- విలేకరుల సమావేశంలో రాష్ట్ర విద్య, ఐటి, శాఖల మంత్రి నారా లోకేష్



**అమరావతి:** జూలై 31 :(వార్తా ప్రభ ప్రతినిధి)ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో 4రోజులపాటు విజయవంతంగా సింగపూర్ లో పర్యటన పూర్తిచేశాం, రాబోయే అయిదేళ్లలో గవర్నమెంట్ ఆఫ్ సింగపూర్ ఇన్వెస్టిమెంట్ కార్పొరేషన్ (జిఐసి) సింగపూర్ సావరిన్ ఫండ్ ద్వారా ఎపిలో 45వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాం, ఇది రాష్ట్రంలో యువతకు గుడ్ న్యూస్, జగన్ కు బ్యాడ్ న్యూస్ అని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. ఉండవల్లి నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్రానికి పెట్టుబడుల సాధన, బ్రాండ్ ఇమేజ్ ను పెంచడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో 4రోజుల పాటు నిర్వహించిన సింగపూర్ టూర్ విశేషాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... 1995 నుంచి సింగపూర్ తో చంద్రబాబుగారికి అనుబంధం ఉంది. సింగపూర్ లో మాకు తెలుగువారు ఘనస్వాగతం పలికారు, సింగపూర్ చరిత్రలో గతంలో ఎన్నడూ లేనివిధంగా 2వేలమంది తెలుగువారు వచ్చారు, రాష్ట్రంలో పెట్టుబడుల కోసం పలు కంపెనీల నుంచి కమిట్ మెంట్స్ తీసుకున్నాం, రాబోయే రోజుల్లో పెద్దఎత్తున పెట్టుబడులు రాబోతున్నాయి. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి నేరపూరిత రాజకీయాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి ఉదయం 8 నుంచి రాత్రి 11.30వరకు రాష్ట్రం కోసం అహర్నిశలు కష్టపడుతున్నారు. సిఎంతో పాటే మేం కూడా పోటీపడి పనిచేస్తున్నాం.

**రికార్డులను సరిచేయడానికే వెళ్లాం** అధికారంలో ఉన్నా, లేకపోయినా చంద్రబాబుగారిని అక్కడి ప్రభుత్వం గౌరవిస్తూ వస్తుంది. సిఎం నేతృత్వంలో నారాయణ, టిజి భరత్ నేను, అయిదుగురు ఐఎఎస్ లు సింగపూర్ వెళ్లాం. రికార్డులను సరిచేయడానికే వెళ్లాం. గతంలో వారితో మాట్లాడకుండా ఏకపక్షంగా ఒప్పందాలు రద్దుచేసి సింగపూర్ కంపెనీలను తరిమేశారు. ప్రపంచవ్యాప్తంగా పారదర్శకతలో టాప్ %-% 5లో సింగపూర్ ఉంటుంది. అలాంటి దేశంపై అవినీతి ముద్రవేసేందుకు ప్రయత్నించారు. దీనివల్ల భారతదేశం కూడా నష్టపోయింది. మన రిప్యూటేషన్ పోయింది. సింగపూర్ అధ్యక్షుడు ధర్మన్ ధర్మన్ షణ్ముగ రత్నం, మంత్రి టాన్ సీలింగ్ తో సహా అక్కడ ప్రభుత్వ పెద్దలందరితో చర్చలు జరిపాం. నాలుగురోజుల్లో ముఖ్యమంత్రి 26 ముఖాముఖి సమావేశాల్లో పాల్గొన్నారు. నేను 19 పారిశ్రామికవేత్తలతో చర్చలతో సహా 35 కార్యక్రమాలకు హాజరయ్యాను. టువాస్ పోర్టు, జురాంగ్ పెట్రో కెమికల్స్, ఐటి, ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, స్పోర్ట్స్ రియల్ ఎస్టేట్ కంపెనీలతో చర్చించాం.

**పెట్టుబడులను అడ్డుకునేందుకు కుట్ర** మురళీకృష్ణ అనే వ్యక్తి సింగపూర్ ప్రభుత్వానికి మంత్రులు, అధికారులు, హైకమీషనర్ కు రాష్ట్రంలో అస్థిరమైన ప్రభుత్వం ఉందని, పెట్టుబడులు పెట్టొద్దని ఈ - మెయిల్ పంపారు. మేం ఆరా తీస్తే ఆ వ్యక్తి పెద్దిరెడ్డికి చెందిన పిఎల్ఆర్ కంపెనీతో, వైసిపి నేతలతో తరచూ మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకునేందుకే ఇటువంటి కుట్రలకు తెరలేపారు. టిసిఎస్ కు 99 పైసలకే భూములిస్తే కోర్టులో కేసులు వేశారు. అయితే వారికి కోర్టు అక్షింతలు వేసింది. అడుగడుగునా అభివృద్ధిని, పెట్టుబడులను అడ్డుకోవడానికి కుట్రలు పన్నుతున్నారు. చెన్నయ్ లో ఒక కంపెనీకి ఇబ్బంది వస్తే రాజకీయాలకు అతీతంగా అక్కడ రాజకీయా పక్షాలన్నీ సింగపూర్ హైకమిషనర్ వద్దకు వెళ్లారు. రాజకీయ పోరాటం చెన్నయ్ వరకే, బయటకు వచ్చాక మేమంతా తమిళనాడు వాళ్లం, రాష్ట్రం కోసం కలసికట్టుగా ప్రయత్నిస్తామని వారు చెప్పారు. మన రాష్ట్రంలో రాష్ట్రాభివృద్ధి కోసం బాండ్స్ విడుదల చేస్తే ఆర్ బిఐ నుంచి అందరికీ ఈ-మెయిల్ ద్వారా తప్పుడు ఫిర్యాదులు చేశారు. ఇటువంటి వారివల్లే ఎపి బ్రాండ్ పడిపోతుంది. ఆ మెయిల్స్ చదువుతుంటే చాలా బాధేస్తుంది. బాబుగారి పేరు చెప్పి మేం కంపెనీలను రాష్ట్రానికి ఆహ్వానిస్తున్నాం. యుఎఇ మంత్రి గారు ఇటీవల భారత్ పర్యటనలో విజయవాడ వచ్చాకే పక్క రాష్ట్రానికి వెళ్లారు. వైసిపి వారు మాత్రం అడ్డంకులు సృష్టిస్తున్నారు. వైసిపి నాయకుల చర్యల వల్ల ఎపితో పాటు ఆ దేశంలో ఉన్న తెలుగువారు నష్టపోతున్నారు.

**ఎపి బ్రాండ్‌ను నాశనం చేసిన జగన్** 2019నుంచి 24వరకు ఎపి బ్రాండ్ ను జగన్ నాశనం చేశాడు. అంతకుముందు సింగపూర్ సంస్థలు, ఎపి చేసుకున్న ఒప్పందాన్ని కనీసం చర్చించకుండా రద్దుచేశారు. ఎపికి అత్యధిక టాక్స్ పేయింగ్ కంపెనీ అయిన అమర్ రాజాను పక్క రాష్ట్రానికి తరిమారు. భారతదేశంలో అది పెద్ద మాల్ డెవలపర్ లులూ గ్రూప్ ఒప్పందం కూడా రద్దుచేశారు. దీనివల్ల నాశనమైంది ఎపి బ్రాండ్, 2024 ఎన్నికల్లో అందుకే ఎన్ డిఎ కూటమిని ప్రజలు గెలిపించారు. ఒక రాష్ట్రం, ఒక రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ కూటమి నినాదం. అనంతపురంకు కియా, కర్నూలుకు రెన్యువబుల్ ఎనర్జీ, ప్రకాశం జిల్లాకు రిలయన్స్ కంప్రెస్ట్ బయోగ్యాస్ ప్రాజెక్టు తెచ్చాం. అమరావతికి దేశంలోనే తొలిసారిగా జనవరిలో 158 క్యూబిక్ క్యాంటమ్ కంప్యూటర్ తెస్తున్నాం. కర్నూలుకు డ్రోన్ సిటీ, క్యాంపా కోలాలాంటి కంపెనీలు వస్తున్నాయి. ఉత్తరాంధ్రకు డేటాసిటీ, ఫార్మాకంపెనీలు, ఐటి పరిశ్రమలు, భారత్ లోనే అతి పెద్ద ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ రాబోతోంది. కంపెనీల వర్టికల్, హారిజంటల్ ఇంటిగ్రేషన్ కు ప్రయత్నిస్తున్నాం. తెలంగాణాకు హైదరాబాద్, కర్నాటకకు బెంగుళూరు, తమిళనాడుకు చెన్నయ్ ఉంటే ఎపికి చంద్రబాబు ఉన్నారని ఆనాడు చెప్పాను. ఆయన సిఎం కావడంవల్లే పోయిన బ్రాండ్ తిరిగి వచ్చింది.సిబిఎన్ 4.0 అంటే స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. 2024లో గెలిచిన వెంటనే ఆదిత్య మిట్టల్ తో జూమ్ కాల్ లో చర్చించాను. ఎన్ ఎండిసి రా మెటీరియల్ కోసం సిఎంతో మాట్లాడి గ్రీన్ సిగ్నల్ ఇప్పించాను. ప్రధానితో ఈ విషయమై 3సార్లు చంద్రబాబు మాట్లాడారు. త్వరలో ఆ ప్రాజెక్టు శంకుస్థాపన చేస్తాం. 2029 నాటికి కమర్షియల్ ప్రొడక్షన్ ప్రారంభమవుతుంది. రాష్ట్రంలో డాటా సెంటర్స్ ఏర్పాటుకు పలు సందేహాలు. కొన్ని కీలకమైన సమస్యలున్నాయి. 4 సమస్యలను పరిష్కరిస్తే విశాఖపట్నంలో డాటా సెంటర్ ఏర్పాటు చేస్తామని ఒక ప్రముఖ సంస్థ మాకు చెప్పింది,

## జగ్గయ్యపేట నియోజకవర్గంలో మాదిగ,మాల (యస్సీ) సోదరలకు కూటమి నాయకులు అన్యాయం చేస్తున్నారు..... కన్నమాల...



పెనుగంచిప్రోలు, జులై 30( వార్త ప్రభ)జగ్గయ్యపేటనియోజకవర్గంలో నెట్టెం రాఘరాం, సామినేని ఉదయభాను, శ్రీరాం. రాజగోపాల్ తాతయ్య,గత నలభై అయిదు సంవత్సరాల నుండి ఎన్నికల సమయంలో ఒకరిమీద ఒకరు ఆరోపణలు చేసుకుంటూ. ఒకరిమీద ఒకరు (శాసనసభ్యులుగా) పోటీ చేసుకుంటూ ఇప్పటివరకు జగ్గయ్యపేట నియోజకవర్గానీ పరిపాలించారని రాష్ట్ర వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్ సి సెల్ ప్రధాన కార్యదర్శి కన్నమాల, శామ్యూల్ తన సొంత గ్రామం అయిన పెనుగంచిప్రోలు మండలం లోని తోట చర్ల తన నివాసం లో గురువారం విలేకరుల సమావేశం లో అన్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఇప్పుడు కూటమి పేరు తో ఒకే ప్రభుత్వంలో అదికారాన్ని అనుభవిస్తూ, ఒకే బ్యానర్ పైన చక్కని చిరునవ్వుతో ముగ్గురు ఫోటోలు వేసుకుంటున్నారు, అదీ మంచిదే ఎవరి ఇష్టం వారిది గతంనుండి పెద్ద పెద్ద పదవులు అనుభవించి%ౌ%. ఇప్పటికీ పదవులు అనుభవిస్తూ సామజకవర్గ పరంగా మంత్రి పదవిరాలేదని ఒకరు, వచ్చినపదవి తనస్థాయికి తగినది కాదు అనుకుంటూ ఇంకొకరు, కొత్త పార్టీలో కొత్తగా యం యల్ సి కావాలని ఇంకొకరు%ౌ%.రాజకీయాల్లో ఉన్నప్పుడు పదవుల విషయంలో ఎవరికయినా పెద్ద పదవి చెయ్యాలని ఆశ వుంటుంది అస్సలు తప్పులేదు%ఈ ముగ్గురు నాయకుల్లో ఇప్పటికీ ఇద్దరు జిల్లా పార్టీ అద్యక్షులుగా వున్నారు.ఈ ముగ్గురు నాయకులు ఎన్నికల్లో పోటీ చేస్తున్న సమయంలో వారి గెలుపు కోసం నియోజకవర్గంలో అత్యధిక ఓటర్లుగావున్న ప్రతి మాదిగ, మాల (యస్సీ) సోదరులకు గెలిచిన తరువాత నావల్లే మీకు న్యాయం జరుగుతుంది నేను తప్పకుండా మీకు మంచి చేస్తానని వాగ్దానాలు చేయడం, హామీలు ఇవ్వటం జరుగుతుంది.ఇప్పటివరకు యస్సి సోదరలకు మన నియోజకవర్గంలో వైస్ చైర్మన్, డైరక్టర్లు, ఉపాధ్యక్షులస్థాయే.. అంతకన్నా ముందుకు వెళ్ళనివ్వరు.వారిలో రాజకీయ చైతన్యం రాకూడదని%నాయకుల్లారా మీరు ఒకసారి ఆత్మపరశీలన చేసుకోండి మీకు ఏదో ఒక సమయంలో మీ రాజకీయ ఎదుగుదలకు కచ్చితంగా యస్సీసోదరలుఉపయోగపడ్డారుఈ రోజున అనుకోకుండా మన దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత జగ్గయ్యపేట మార్కెట్ యార్డ్ ఏర్పడ్డ తరువాత రాక రాక మొట్ట మొదటిసారి గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వై యస్ జగన్ మోహన్ రెడ్డి నామినేటడ్ పదవుల్లో కూడా కల్పించిన రిజర్వేషన్ల ప్రకారం మార్కెట్ యార్డ్ చైర్మన్ గా ఎస్ సి వారికి అవకాశం వచ్చింది%ౌ%. రాక రాక వారికి వచ్చిన అవకాశాన్ని వేరేవారికి కేటాయించాలని నిర్ణయం తీసుకోవటం మీరు దళితులకు కావాలని అన్యాయం చేస్తున్నట్లే కనిపిస్తుంది.కావున నాయకుల్లారా మీకు మాదిగ మాల (యస్సీ) సోదరులపట్ల ఎటువంటి దురభిప్రాయం లేకపోతే వారికి వచ్చిన రిజర్వేషన్ ప్రకారం వారికి వచ్చిన మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి మొదట వారికే కేటాయించి.మాదిగ మాల (యస్సీ) సోదర్లను మార్కెట్ యార్డ్ చైర్మన్ గా చెయ్యగలరని, తరువాత రెండు సంవత్సరాలు మీకు నచ్చిన వారికి, మీకు కావలసినవారికి చైర్మన్ పదవి ఇచ్చుకోగలరని మనస్పూర్తిగా రెండు చేతులు జోడించి ప్రార్థిస్తున్నా అని పేర్కొన్నారు.

# పదవి విరమణ చేపట్టిన సమాచార శాఖ పబ్లిసిటీ అసిస్టెంట్ చోరగుడి జాక్సన్ బాబు.





**విజయవాడ,** జూలై 31 **:(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్ర సమాచార కేంద్రం, విజయవాడలో పబ్లిసిటీ అసిస్టెంట్ గా పనిచేస్తూ పదవి విరమణ చేసిన చోరగుడి జాక్సన్ బాబు యొక్క వీడ్కోలు సమావేశాన్ని రాష్ట్ర సమచార మరియు పౌర సంబంధాల కమిషనర్ కార్యాలయంలో గురువారం నిర్వహించడం జరిగింది. 30 సంవత్సరాలు విధిగా తన భాద్యతలను నిర్వర్తిస్తూ తనదైన శైలిలో సేవలు అందించిన చోరగుడి జాక్సన్ బాబుకు పదవి విరమణ శుభాకాంక్షలను తెలియజేస్తూ తను సేవలకు గుర్తుగా సమాచార శాఖ ఉద్యోగులంతా కలిసి ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సమచార మరియు పౌర సంబంధాల శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీమతి స్వర్ణలత, జాయింట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ మరియు ఇతర అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర సమచార మరియు పౌర సంబంధాల శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీమతి ఎల్ .స్వర్ణలత మాట్లాడుతూ, జాక్సన్ బాబు దాదాపు 30 సంవత్సరాల పాటు నిర్విరామంగా పుబ్లిసిటీ అసిస్టెంట్ గా సేవలు అందించారని, ఉద్యోగ రిత్యా ఎన్నో రోజులు కుటుంబానికి దూరంగా ఉండాల్సి వచ్చిన సందర్భంలో కూడా సంయమనం కోల్పోకుండా భాద్యతలు నిర్వర్తించారని తెలియజేస్తూ పదవి విరమణ చేపడుతున్న జాక్సన్ బాబుకి శుభాకాంక్షలు తెలిపారు.రాష్ట్ర సమచార మరియు పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ జాక్సన్ బాబుకు పదవి విరమణ శుభాకాంక్షలను తెలియచేసారు. పబ్లిసిటీ అసిస్టెంట్ గా జాక్సన్ బాబు అందించిన సేవలు ఏంటో గొప్పవని, టెక్నాలజీ పూర్తిగా అందుబాటులో లైని రోజుల్లో ప్రభుత్వం తమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి పబ్లిసిటీ అసిస్టెంట్ లను విరివిగా ఉపయోగించుకునే వారని, అటువంటి సమయంతో సంబంధం లేకుండా పనిచేయాల్సి వచ్చిన జాక్సన్ బాబు ఎంతో ఓర్పుగా చేసేవారని, పుష్కరాలు, వరదలు వంటి అనేక సందర్భాల్లో కలిసి పనిచేశామని ఇక పైన ఆయన సేవలు దూరమవడం బాధాకరం అన్నారు. అనంతరం రాష్ట్ర సమాచార కేంద్రం విజయవాడ సహాయ సంచాలకులు ఎమ్. భాస్కర్ నారాయణ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల పాటు తానూ జాక్సన్ బాబు కలసి పని చేశామని, తన పనిని ఎంతో ఓర్పుగా నిర్వర్తిస్తారని, చేసే పనిలో ఎటువంటి లోపాలకు చోటివ్వకుండా ఎంతో సహకారం అందించేవారని తెలుపుతూ జాక్సన్ బాబుకు పదవి విరమణ శుభాకాంక్షలను తెలియచేసారు. ఈ పదవి విరమణ కార్యక్రమానికి రాష్ట్ర సమచార మరియు పౌర సంబంధాల శాఖ డెప్యూటీ డైరెక్టర్ పూర్ణచంద్ర రావు, అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరామరాజు గౌడ్, నారాయణ రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ సుదర్శన్, ఎన్ టీ ఆర్ జిల్లా సమచార శాఖ డిఐపిఆర్ఓ రమణ, డిపిఆర్ఓ మోహన్, డివిజనల్ పిఆర్ఓ రవి, ఎవిఎస్ ప్రసాద్ మరియు తదితర సిబ్బంది హాజరయ్యారు.

# సికింద్రాబాద్ డివిజన్ ను యథావిధిగా కొనసాగించాలి



**ఇబ్రహీంపట్నం, జూలై 31 (వార్తా ప్రభ ప్రతినిధి):** దక్షణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు నేపథ్యంలో సికింద్రాబాద్ డివిజన్ లోని విజయవాడ రన్నింగ్ బ్రాంచ్ ను తెలంగాణకు మార్చాలనే ఆలోచనను విరమించుకొని యథావిధిగా విజయవాడలోనే కొనసాగించాలని రైల్వే కార్మిక యూనియన్స్ ఏజేసీ నేతలు డిమాండ్ చేశారు. రైల్వే లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లు సుమారు 550 పైగా కుటుంబాలు గురువారం విజయవాడ ప్రెస్ క్లబ్ లో సమావేశమై జేఏసీగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా విజయవాడలో ఉన్న రన్నింగ్ బ్రాంచి ఉందని ఇక్కడి నుంచి సికింద్రాబాద్ డివిజన్ లోకి రాకపోకలు సాగించే ఎక్స్ ప్రెస్ రైళ్లు, గూడ్స్ రైళ్లలో పనిచేసే రన్నింగ్ కార్మికులు ఈ ప్రాంతాల్లో స్థిరపడ్డారని ఇప్పుడు తెలంగాణలోకి రన్నింగ్ బ్రాంచ్ ను మార్చడం వల్ల ఇబ్బందులు పడతారని వాపోయారు. విజయవాడలోనే రన్నింగ్ బ్రాంచ్ ఉంచాలని సికింద్రాబాద్ డివిజన్ లోని ఉన్నతాధికారులందరికీ వినతిపత్రాలు అందించినట్లు చెప్పారు. సమావేశంలో ఎస్ సీఆర్ఎంయూ, ఎస్ సీఆర్ఈఎస్, ఏఐఆర్ఎస్ఏ, ఏఐజీసీ అండ్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ముగిసిన అష్టబంధన మహాసంప్రోక్షణ కార్యక్రమాలు

## - ఆలయ పర్యవేక్షకులు ఎం.మల్లికార్జున








**విజయవాడ,** జూలై 31 **:(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ, పున్నమ్మతోటలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో అష్టబంధన మహాసంప్రోక్షణ కార్యక్రమాలు గురువారం వైభవంగా ముగిసాయి. ఈ మేరకు ఆలయ పర్యవేక్షకులు ఎం.మల్లికార్జున తెలిపారు. చివరి రోజు 5,000 మందికి పైగా అన్న ప్రసాద వితరణ చేసినట్లు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో పున్నమ్మతోటలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో జూలై 26వ తేదీ నుంచి అష్టబంధన మహా సంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవాలను ఆగమ శాస్త్ర ప్రకారం అత్యంత వైభవంగా నిర్వహించామని.. చివరి రోజు గురువారం మహాపూర్ణాహుతి, ఆలయప్రవేశం, మహాసంప్రోక్షణ, అక్షతారోహణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. బ్రహ్మఘోషతో కార్యక్రమం ముగిసిన్నట్లు వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విశేష హోమాలు కార్యక్రమంలో పాల్గొని.. స్వామి వారిని దర్శించి అన్న ప్రసాదం స్వీకరించారని మల్లికార్జున తెలిపారు. ఈ కార్యక్రమ విజయవంతానికి కృషిచేసిన దాతలు, టీటీడీ అర్చక స్వాములు, వేద పండితులు, సేవకులు, మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

# అంతర్జాతీయ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవం




మానవులలో ఎక్కువగా కనిపించే ఐదు రకాల క్యాన్సర్లలో ఊపిరితిత్తుల క్యాన్సర్ ఒకటి. ఇది చాలా తీవ్రమైనది. మనిషి ఊపిరి తీసుకుని జీవించి ఉండేందుకు ఉపయోగపడే ఊపిరితిత్తులకు క్యాన్సర్లు సోకడం ఆందోళన కలిగిస్తున్నది. నాగరీక జీవన శైలి వల్ల, వాహనాల వినియోగం పెరిగిపోవడం, పచ్చదనం తగ్గిపోవడం, పారిశ్రామికీకరణల వల్ల రోజు రోజుకు వ్యాధి బారినపడే వారి సంఖ్య పెరిగిపోతుంది. ప్రధానంగా పొగ తాగే వారికి కంటే వారి పక్కన ఉండి ఆ పొగ పీల్చే వారికి కూడా ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధి సోకుతుంది. మహిళలు, పిల్లలు ఈ బాధితులే. ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసులకు, టోల్ గేట్ ల వద్ద, పనిచేసే సిబ్బందికి, క్వారీలు, మైనింగ్, తారురోడ్లు, సిమెంట్ నిర్మాణాల పనుల్లో పాల్గొనే వారికి ఊపిరితిత్తుల క్యాన్సర్లు వస్తున్నట్లు వైద్య నివేదికలు తెలియజేస్తున్నాయి. అదే విధంగా రేడియేషన్, హెచ్ ఐ వి వైరస్ ఇన్ఫెక్షన్ వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడే అవకాశాలు లేకపోలేదు.


**ఊపిరితిత్తుల క్యాన్సర్ యొక్క కొన్ని సాధారణ లక్షణాలు** నిరంతర దగ్గు, ఆయాసం, కఫంలో రక్తం, ఛాతి నొప్పి (దగ్గుతున్నప్పుడు,లోతైన శ్వాస తీసుకుంటున్నప్పుడు) ఆకలి తగ్గడం, బరువు తగ్గడం **ఈ క్యాన్సర్ పెరుగుతున్నప్పుడు :** ఎముకల నొప్పి, తలనొప్పి ముఖం, మెడ లేదా చేతుల్లో వాపు ఉండవచ్చు.

**ఈ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు:** ముందుగా ప్రజలు వ్యాధి పట్ల అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలి. పొగ తాగకూడదు. అలాగే పొగ తాగే వారికి సమీపంలో ఉండకూడదు. కుటుంబంలో ఒకరికి ఊపిరితిత్తుల క్యాన్సర్ ఉంటే, ఇతర కుటుంబ సభ్యులు తప్పని సరిగా ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవడం చాలా ఉత్తమం. వారానికి ఐదు యాపిల్, జామి పండ్లు తింటే ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది. పౌష్టకాహారం తీసుకోవడం ద్వారా ఊపిరితిత్తుల క్యాన్సర్ బారినపడే ముప్పు నుండి తప్పించుకోవచ్చును. క్యాన్సర్లను గుర్తించేందుకు నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు, చికిత్స అందుబాటులో ఉన్నాయి. కాబట్టి వ్యాధి సోకిన వారు ఆందోళన చెందకుండా వైద్యుల సలహాలు పొందుతూ వ్యాధిని జయించవచ్చు.

-కొల్లాబత్తుల సూర్య కుమార్.

# సుజాతనగర్ లో కల్తీ, నాసిరకం వస్తువులను అమ్ముతున్న వ్యాపారులు

- నకిలీ విక్రయాల జోరు
- కాలం చెల్లిన సరుకుల అమ్మకాలు
- పురుగులు పట్టిన సరుకులు విక్రయాలు
- సంబంధిత అధికారులు లేక కొరవడిన పర్యవేక్షణ
- కొనసాగుతున్న జీరో వ్యాపారం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వార్తా ప్రభ (ప్రతినిధి)** సుజాతనగర్, పలు ప్రాంతాల్లో వ్యాపారులు కల్తీ, నాసిరకం వస్తువులను విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. కల్తీ చేసినవి, కాలం చెల్లినవి, పురుగులు పట్టిన సరుకులు అమ్ముతున్నా పట్టించుకునే నాథుడే లేడు. జిల్లాలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు అంటున్న ప్రజలు ఫుడ్ సేఫ్టీ అధికారులు లేకపోవడంతో యేధేచ్ఛగా కల్తీ నూనెలు, ఆహార పదార్థాలను ప్రజలకు అంటగడుతూ వినియోగదారుల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారు. సుజాతనగర్ మండల కేంద్రంలో చుట్టుపక్కల , తదితర ప్రాంతాల్లో కల్తీ, నాసిరకం వస్తువులను విక్రయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారిని లక్ష్యంగా చేసుకొని విక్రయాలు జరుపుతున్నారు. వీటిని వాడడం వలన చాలా మంది రోగాల బారిన పడుతున్నారు. ప్రధానంగా వంట నూనెలు, అసలు వస్తువులను పోలిన నకిలీ వస్తువులు విక్రయిస్తూ లక్షలు గడిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అలాగే కారం పొడి, పసుపు ఇతర మసాల దినుసుల చిన్న పరిశ్రమల్లోనూ పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా తయారైంది. గతంలో కేవలం ఎప్పుడో ఒకసారి మాత్రమే వస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు చాటుమాటుగానే పర్యవేక్షణ జరిపి మామూలుగా వెళ్లిపోతున్నారనే ఆరోపణలున్నాయి. కేవలం ఒక్క కేసు నమోదు కాకపోవడమే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. జీరో దందా కూడా పెద్ద ఎత్తున కొనసాగుతోంది అని చర్చ నడుస్తుంది అధికారులు కళ్ళు తెరిచి ఇకనైనా చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు

# మినీవ్యాన్, లారీ ఢీ.. ఒకరు మృతి

**ఏలూరు,** జూలై 31 **:(వార్తా ప్రభ ప్రతినిధి)** మొక్కజొన్న లోడుతో వెళ్తున్న మినీ వ్యాన్ ముందు వెళ్తున్న లారీని ఓవర్టేక్ చేయబోయి అదుపుతప్పి అదే లారీని ఢీకొంది. ఈ ఘటనలో మినీ వ్యాన్ లో ప్రయాణిస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన ఏలూరు జాతీయ రహదారిలోని గుండుగొలను సమీపంలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మృతుడు జగ్గంపేట మండలానికి చెందిన వినయ్ కుమార్ (21) గా గుర్తించారు. వ్యాన్ డ్రైవర్ సురేష్ కు స్వల్ప గాయాలు అయ్యాయి.

# టైలరింగ్ లో మహిళలకు ఉచిత శిక్షణ




**మైలవరం,జూలై 31 (వార్తాప్రభ) :** స్థానిక మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్,బ్యూటీషియన్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమాయ్యాయి. నూజివీడు రోడ్డు లోని మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణా కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసిన మహిళా,స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిణి (CDPO) పుష్పలత ప్రారంభించారు.ఈ సందర్భంగా పుష్పలత మాట్లాడుతూ పేద, మధ్య తరగతి మహిళల ఆర్ధిక అభివృద్ధికి ఈ శిక్షణలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.గ్రామీణ ప్రాంతాలలో మహిళలకు నైపుణ్యం, ఉపాది కల్పనకు మీకు ఎలాంటి ఖర్చు లేకుండా ఇలా శిక్షణ ఇవ్వడం ఈ ప్రాంతంలో మీ అందరి అదృష్టం అని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల న్నారు.స్వచ్ఛందంగా సమాజానికి సేవలందించే ట్రస్ట్ నిర్వాహకులకు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు.సమాజానికి సేవలందిస్తున్న కోయ సుధ ను పుష్పలత అభినందించారు.కోయ సుధ మాట్లాడుతూ ఈ శిక్షణ రెండు నెలలు పాటు జరుగుతుందని,ఆధునిక పద్దతిలో సులువుగా నేర్చుకొనేలా నైపుణ్యం పెంపొదింస్తామని,శిక్షణ అనంతరం ధృవీకరణపత్రం అందించి బ్యాంకులు ద్వారా ప్రభుత్వం అందించే ఎంఎస్ఎంఇ (MSME) సబ్సిడీ,డ్వాక్రా లోన్స్ అందేలా సహకరించి యూనిట్ ఏర్పాటు చేసి మహిళలు ఆర్ధికంగా ఎదిగేలా కృషి చేయడమే ట్రస్ట్ ఉద్దేశ్యమని అన్నారు.ఈ శిక్షణా తరగతులకు సహకరిస్తున్న దాతలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జూలకంటి ప్రసాద్, ట్రస్ట్ కార్యదర్శి సగ్గుర్తి విజయలక్ష్మి, కోశాధికారి ద్రోణవల్లి విజయలక్ష్మి, ట్రైనర్స్ అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# పంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలుపై దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలి -శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ ఎ.కమల

● పంచాయతీ కార్యాలయం వద్ద నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపిన పంచాయతీ కార్మికులు



**మైలవరం,జూలై 31 (వార్తాప్రభ) :** గ్రామ పంచాయితీ పారిశుద్ధ్య కార్మికురాలుగా విధులు నిర్వహిస్తున్న బిజిలీ భవాని పై దాడి చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేయాలని శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ (సిఐటియు) ఎ.కమల డిమాండ్ చేశారు.స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం మధ్యాహ్నం సిఐటియు ఆధ్వర్యంలో పంచాయతీ పారిశుధ్య కార్మికులు బిజిలీ భవాని కి న్యాయం చేయాలని కోరుతూ నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కమల మాట్లాడు తూ కరోనా టైం లో కూడా తమ ప్రాణాలను లెక్క చేయకుండా సేవలందించిన పంచాయతీ కార్మికులపై దౌర్జన్యం చేయటం హేయమైన చర్య అన్నారు.పంచాయతీ కార్మికురాలు భవానీ పై దాడి చేసిన ఉమామహేశ్వరరావును వెంటనే అరెస్టు చేయాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.మహిళా కార్మికురాలిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయకుండా పోలీసులు నిర్లక్ష్యంగా ఉండటం మంచి పద్ధతి కాదన్నారు.బాధితురాలి పక్షాన నిలబడి పోరాటం చేసేవారిని అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించిన వారు దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయటానికి ఏ రాజకీయ పార్టీ నాయకులు అడ్డుపడుతున్నారో పోలీసులు బహిర్గతం చేయాల న్నారు,తెదేపా ప్రజాప్రతినిధుల అండ చూసుకొనే ఉమామహేశ్వరరావు అనే వ్యక్తి కార్మికురాలుపై దాడి చేశాడని కమల ఆరోపించారు.దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం అవుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ సుధాకర్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు వీరమ్మ, చంద్రావు, ప్రశాంత్, శివ, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు వజ్రాల ధనలక్ష్మి, వి. వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ..




**గుడివాడ,జూలై 31 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ కాలనీ 7వ వార్డులో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేసి సచివాలయం అడ్మిన్ కి మెమొరాండం ఇవ్వడం జరిగింది. స్మార్ట్ మీటర్లు బిగించడానికి ప్రజలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు, ప్రజలకి ప్రభుత్వం ఇప్పటికే కరెంట్ బిల్లులు పెంచి సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీలు పేరుతో పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారు, వీటినే కట్టలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు కాబట్టి ఇప్పటికైనా స్మార్ట్ మీటర్లను ఉపసంహరించాలిందిగా డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలో సి.ఐ.టి.యు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ సి పి రెడ్డి, సాహితీ స్రవంతి ఎల్ సురేంద్ర, పి రజిని, సత్యవతి, శనగపాటి నాగేశ్వరావు, మాల మహానాడు నాయకులు పంతగాని సురేష్, ఎండి భాష, బసవలింగం తదితరులు పాల్గొన్నారు.

# వేగం కన్నా.. ప్రాణం మిన్న



**గుడివాడ,జూలై 31 (వార్తాప్రభ) :** ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటించడంలో పోలీసులకు సహకరించాలని ఏఎస్ఐ భాగ్యవతి సూచించారు. గురువారం ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో ఏలూరు రోడ్ లోని కరెంట్ ఆఫీస్ వద్ద జంక్షన్లో ట్రాఫిక్ ఏఎస్ఐ, క్లబ్ లైఫ్ పేట్రన్ సభ్యులు వి.భాగ్యవతి, ట్రాఫిక్ సిబ్బందితో క్లబ్ సభ్యులు ట్రాఫిక్ రూల్స్ అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేమంగా వెళ్లి క్షేమంగా రండనే రూల్స్ స్టిక్కర్ వాహనాలకు అంటించి గులాబీ పువ్వు అందించి ట్రాఫిక్ రూల్స్ అధిగమించవద్దని వారు హితవు పలికారు. వేగం కన్నా ప్రాణం మిన్నని సీట్ బెల్ట్, హెల్మెట్ తప్పక ధరించాలని, డ్రైవింగ్లో ఫోను మాట్లాడవద్దని మద్యం తాగి డ్రైవ్ చేయవద్దని మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, ఏఎస్ఐ భాగ్యవతి లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కోన రామారావు, కార్యదర్శి దిమ్మిటి శ్రీనివాసరావు, తమ్మినేని రామ్మోహన్, డిప్యూటీ గవర్నర్ మేరుగుమాల శివ రామకృష్ణ, అర్జా ప్రసాద్, మున్నలూరి రామకృష్ణ, పొన్నూరు సత్యనారాయణ, పిప్పి సత్యనారాయణ, వంగపండు బ్రహ్మాజీ, మరదాని వెంకటేశ్వరరావు, కందిపల్లి సూరి, కూరాకుల శ్రీనివాసు, శైలజ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# నందిగామ గ్రామ నౌకరు మృతి..

-టీడీపీ నాయకుల ఆర్థికసాయం



**పెడన,జూలై 31 (వార్తాప్రభ) :** పెడనమండలం నందిగామ కు చెందిన గ్రామ నౌకరు బొడ్డు చెంచులు అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు.ఈవిషయం తెలిసిన నందిగామ పి ఎ సి ఎస్ అధ్యక్షుడు యరగని నాగరాజు సొసైటీ నుంచి 10 వేలు దావోజిపాలెం పి ఎ సి ఎస్ అధ్యక్షుడు కాగిత నాగేశ్వరావు వ్యక్తిగత సాయం కింద 5 వేల రూపాయలు అందించారు.గ్రామానౌకరు కుటుంబ సభ్యులను వీరు పరామర్శించారు.

# ఉత్తమ బోదన ద్వారానే ఉపాధ్యాయునికి గుర్తింపు



**హనుమాన్ జంక్షన్,జూలై 31 (వార్తాప్రభ) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అప్పన వీడు ప్రధానోపాధ్యాయిని తోట పుష్పావతి అధ్యక్షతన జీవశాస్త్ర ఉపాధ్యాయ ని మాగంటి అమరావతి పదవి విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.హెచ్ ఎం పుష్పవతి మాట్లాడుతూ టీచర్ అమరావతి విద్యార్థుల కు పాఠ్యాంశాలను బాగా అర్థవంతంగా బోధించడం ద్వారా మంచి ఫలితాలను సాధించారని ఎందరో విద్యార్థులు ఉన్నత స్థానంలో నిలవడానికి ఆమె బోధన దోహదపడిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ మాగంటి లక్ష్మి, గన్నవరం మాజీ శాసనసభ్యులు దాసరి బాలవర్ధనరావు, మరియు దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్, స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్ వేలేరు మాజీ గ్రామ సర్పంచ్ వేములపల్లి శ్రీనివాస్, పెదపాడు మండల విద్యాశాఖ అధికారులు సబ్బితి నరసింహమూర్తి మరియు జే రవీంద్రలు పాల్గొన్నారు. టీచర్ అమరావతి పదవ తరగతి ప్రథమ ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేయవలసిందిగా పాఠశాలకు లక్ష రూపాయలు తన తల్లి చేతుల మీదగా విరాళం డిపాజిట్ చేసి ప్రధాన ఉపాధ్యాయులకు అందజేశారు.

# ఎమ్మెల్యే మాట ఇచ్చారు నెరవేర్చారు



**తిరువూరు,జూలై 31 (వార్తాప్రభ) :** 9వ వార్డు నగర పంచాయతీ పరిధిలోని 9 వ వార్డులో డంపింగ్ యార్డ్ రోడ్డు లో గల గృహ సముదాయాలకు మంచినీరు కుళాయిలు లేక ఎండిఓ ఆఫీస్ వద్దగల మంచినీటి ట్యాంక్ వద్ద నుండి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఎమ్మెల్యే గారికి స్థానిక ప్రజలు మొరపెట్టుకోగా తిరువూరు నగర పంచాయతీ ఏఈ పైప్ లైన్ వేయుటకు నిధులను మంజూరు చేయడం జరిగింది. శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు నగర పంచాయతీ ఇంజనీరింగ్ ఏఈ స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు

# ఘనంగా పర్వతనేని ఆనంద్ పుట్టినరోజు వేడుకలు

● శ్రీ కృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో.. ● అన్నదానం నిర్వహించిన పర్వతనేని అభిమానులు..




**గుడివాడ,జూలై 31 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ స్టేడియం కమిటీ మాజీ సంయుక్త కార్యదర్శి పట్టణ ప్రముఖులు పర్వతనేని ఆనంద్ 70వ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి.ఆనంద్ థియేటర్ శ్యామ్ మరియు ఆనంద్ అభిమానుల ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డు లోని మమత వృద్ధుల ఆశ్రమంలో పర్వతనేని ఆనంద్ పుట్టినరోజు కార్యక్రమాలు గురువారం ఉదయం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు భోజన వసతి ఏర్పాటు చేసిన అభిమానులు, పండ్లు పంపిణీ చేశారు. ముందుగా అభిమానులు ఏర్పాటు చేసిన పుట్టినరోజు కేక్ ను ఆనంద్ కట్ చేశారు. అనంతరం ఆనంద్ థియేటర్ శ్యామ్ మరియు, అభిమానులు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆనంద థియేటర్ శ్యామ్, ఆనంద్ అభిమానులు నరసింహారావు చినబాబు దేవి వరప్రసాద్ సాయి, రాహుల్, షేక్ కన్వర్, రైతు బజార్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

**పర్వతనేని సేవలు అభినందనీయం -సిఐ చిన్ని నాగప్రసాద్**

శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం అధ్యక్షులు పుట్టి హరికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియం మాజీ జాయింట్ సెక్రెటరీ పర్వతనేని ఆనంద్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక ఏలూరు రోడ్ లోని కర్ల వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ చిన్ని నాగ ప్రసాద్ విచ్చేసి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగ ప్రసాద్ మాట్లాడుతూ బుజ్జి బాబు అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ గత కాలం నుంచి నేటి వరకు అనేక సేవా కార్యక్రమం చేస్తున్నరని ఆయనను అభినందించారు. అదేవిధంగా హరికుమార్ అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి మనల్ని పొందుతూ పదిమందికి ఉపయోగపడే సేవా కార్యక్రమం చేస్తున్న ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు ముందు ముందు ఇంకా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు బొగ్గరపు తిరుపతయ్య, వడ్లమూడి నరసింహారావు, జాజుల తాతారావు, కర్ల వృద్ధాశ్రమ నిర్వాహకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# యూనివర్సిటీల్లో వీసీలను తక్షణమే నియమించాలి -ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్




**గుడివాడ,జూలై 31 (వార్తాప్రభ) :** స్థానిక సుందరయ్య భవనంలో జరుగుతున్న భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కృష్ణాజిల్లా ప్లీనరీ సమావేశాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ప్లీనరీ సందర్భంగా ఎస్ఎఫ్ఐ స్వతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం జెండాని జిల్లా అధ్యక్షులు ప్రేమ్ కుమార్ ఆవిష్కరించగా, భగత్ సింగ్ చిత్రపటానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్ నాయుడు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగం లోనికి మార్పులు తీసుకురావడం, యూనివర్సిటీల్లో వీసీలను నియమించకపోవడం, తాత్కాలిక వీసీలతో ఎంతవరకు యూనివర్సిటీల్ని నడుపుతారని ప్రశ్నించారు. డిగ్రీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ కల్పించాలని, నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, మండలానికి ఒక జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేసి అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పీజీ విద్యార్థులకు జీవో నెంబర్ 77ను రద్దుచేసి పీజీ విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్మెంట్ కల్పించాలన్నారు. పాఠశాల మౌలిక వసతులు కొనసాగించాలని సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించి వాళ్ళ మెస్ చార్జీలను పెంచాలని, విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఎస్ఐ కష్ణా జిల్లా కార్యదర్శి ఎస్. సమరం, పూర్వ జిల్లా కార్యదర్శి వై నరసింహారావు, మాజీ జిల్లా కార్యదర్శి పవన్ కుమార్, మాజీ జిల్లా అధ్యక్షుడు పవన్, ఎస్ఎఫ్ఎస్ఐ అధ్యక్షులు ఈ. ప్రేమ్ కుమార్, ఎస్ఎఫ్ఎస్ఐ సహాయ కార్యదర్శి హారిక, ఎస్ఎఫ్ఎస్ఐ ఉపాధ్యక్షులు సలీం, ఎస్ఎఫ్ఎస్ఐ గుడివాడ మండల అధ్యక్షులు జగన్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని దానాల్లోకెల్ల గొప్పది అన్నదానం - ఈ.ఓ. గోపాలరావు



**గుడివాడ,జూలై 31 (వార్తాప్రభ) :** గౌరీ శంకర పురంలో వేంచేసియున్న శ్రీ గౌరీ శంకర స్వామి వారి దేవస్థానం నందు ఉపాలయం అయినా శ్రీ శిరిడి సాయిబాబా వారి మందిరంలో ప్రతి నెల ఆఖరి గురువారం అత్యంత వైభవముగా నిర్వహించబడు అన్నదాన కార్యక్రమమును గురువారం ఆలయ కార్యనిర్వాహణాధికారి కందుల వేణుగోపాల రావు చేతులమీదుగా ప్రారంభించి.. సుమారుగా 1500 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా కార్యనిర్వాహణాధికారి ఈ.ఓ. వేణుగోపాలరావు మాట్లాడుతూ దానాలలోకెల్ల గొప్పది అన్నదానం అని ఈ కార్యక్రమమునకు సహాయ సహకారములు అందిస్తున్న భక్తులకు ప్రత్యేకంగా ధన్యవాదములు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో భక్తులు నెరుసు సుభాష్ చంద్రబోస్ మరియు దేవస్థాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డల ఆరోగ్యం





**గుడివాడ,జూలై 31 (వార్తాప్రభ) :** రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ వారి ఆధ్వర్యంలో ఈ నెల మేటర్నిటి & చైల్డ్ హెల్త్ నిమిత్తం గురువారం మార్కెట్ సెంటర్ లో ఉన్న సంఘం స్కూల్ నందు ఉదయం 60 మంది గర్భిణీ స్త్రీలకు, ప్రోటీన్ పౌడర్ చిక్కిలు, రస్కులు, ఇవ్వటం జరిగింది. మరియు స్లాటర్ పేటలో అంగన్వాడీ పాఠశాలలో 40 మంది గర్భిణీ స్త్రీలకు. ప్రోటీన్ పౌడర్, చిక్కీలు, ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమం లో పెలికాన్ హాస్పిటల్ ఎం.డి. డాక్టర్ వై. రోజా (స్త్రీ ప్రసూతి వైద్య నిపుణులు) మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు మరియు బాలింతలకు ప్రోటీన్ తో కూడుకున్న ఆహారం దాని అవశ్యకతను వారికి వివరించి తదుపరి వారికి ప్రోటీన్ పౌడర్, చిక్కీలు, రసకులను అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో మన రొటేరియన్స్ ప్రెసిడెంట్ యలమంచిలి నాగేశ్వరావు, సెక్రటరీ గుళ్ళపల్లి కిరణ్ బాబు, అసిస్టెంట్ గవర్నర్, ముళ్ళపూడి రమణ మూర్తి, పాస్ట్ ప్రెసిడెంట్స్ డా॥ యలమంచిలి రోజా, బలుసు శంకరరావు, అడుసుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, డి. జ్యోతిశ్వరరావు, ఏ.జే.ప్రసాద్ మొదలగు సభ్యులు పాల్గొన్నారు.

# వివిధ రకాల ఉత్పత్తులతో డ్వాక్రా మహిళల మెప్మా బజార్



**గుడివాడ,జూలై 31 (వార్తాప్రభ) :** గుడివాడ పురపాలక సంఘం పరిధిలో గురువారం మెప్మా బజార్ అర్బన్ మార్కెట్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ యొక్క బజారులో పొదుపు సంఘాల మహిళలు తయారు చేసుకున్న వస్తువులు మరియు తినుబండారాలు అమ్మకం మరియు ప్రదర్శన జరుగుతుంది. ప్రతి నెల యొక్క అర్బన్ మార్కెట్ కండక్ట్ చేయడం జరుగుతుంది. ఈ యొక్క అర్బన్ మార్కెట్ ని గురువారం కమిషనర్ ఎస్. మనోహర్ మరియు అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు లు సందర్శించడం జరిగింది. ఈ యొక్క మెప్మా బజారులో 25 నుంచి 40 రకాల ఉత్పత్తులు అమ్మకం మరియు ప్రదర్శన చేయడం జరిగిందని తెలియపరచడమైనది.

# ఆగస్టు 2న న్యాయసేవ సదస్సును విజయవంతం చేయండి - ఆర్డీఓ కె.మాధవి



**తిరువూరు,జూలై 31 (వార్తాప్రభ) :** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాదికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మరియు జిల్లా యంత్రాంగం సంయుక్తంగా నూతన తరహా న్యాయ సేవల శిబిరాన్ని (న్యూ మాడ్యుల్ లీగల్ సర్వీసెస్ క్యాంప్) లో భాగంగా ఆగస్టు 2వ తేదిన న్యాయ సేవా సదస్సును విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని తిరువూరు ఆర్డీఓ కె.మాధవి తెలిపారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న న్యాయ సేవా సదస్సుకు చేపట్టవలసిన ఏర్పాట్లపై గురువారం తిరువూరు ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ మాధురి వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆగస్టు 2వతేదిన ఏ కొండూరు మండలం గోపాలపురంలోని ఎస్ఎన్ కన్వెన్షన్ హాలులో న్యాయ సేవా సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. సదస్సులో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, మాదక ద్రవ్యాల నిరోధకం వంటి పలు అంశాల పై చర్చించడం జరుగుతుందన్నారు. దీనితో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు పై లబ్దిదారులకు అవగాహన కల్పించవలసిన అవసరం ఉందన్నారు. ఇందుకు సంబంధించి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న శాఖల చెందిన అధికారులు పథకాల సంక్షిప్త సమాచారంతో స్టాల్స్ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ స్కీం 2015, అవేర్నెస్, సపోర్ట్, హెల్ప్ అండ్ యాక్షన్ (ఆషా)2025, డ్రగ్స్ అవేర్నెస్ వెల్నెస్ నావిగేషన్ స్కీం 2025, తో పాటు గవర్నమెంట్ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సదస్సులో మాదకద్రవ్యాల వినియోగం వలన ఎదురయ్యే సమస్యలు మాదకద్రవ్యాల నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కలిగించడంతో పాటు బాధితులకు చట్టాలపై ప్రజలకు వివరించడం జరుగుతుందని ఆమె తెలిపారు.రెవెన్యూ, పోలీస్, డిఆర్డిఏ, పంచాయతీరాజ్ , మున్సిపల్ కార్పొరేషన్, స్త్రీ శిశు సంక్షేమం, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, వెనుకబడిన తరగతుల సంక్షేమం, మైనార్టీ సంక్షేమం, విద్య, వైద్య ఆరోగ్య, తదితర శాఖల అధికారులు సమన్వయంతో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి సదస్సును జయప్రదం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డిఓ కే మాధురి కోరారు.

# గ్రంథాలయ అభివృద్ధిలో సంపత్ పాత్ర మరువలేనిది - సంస్థ కార్యదర్శి రవికుమార్






**విజయవాడ,జూలై 31 (వార్తాప్రభ) :** చిత్తరంజన్ గ్రేడ్ -2 శాఖా గ్రంథాలయం సత్యనారాయణపురం నందు గ్రంథాలయాల అధికారి పి సంపత్ కుమార్ పదవీ విరమణ విరమణ సత్కార సభ నిర్వహించడమైనది. మొదటిగా పాప శ్రీ తన్వి ఓపెనింగ్ డాన్స్ తో సభ ప్రారంభించడం అయినది.మొదటిగా ఆర్ శ్రీనివాసులు హాజరైన పెద్దలను వేదిక మీదకి ఆహ్వానించడమైనది. తదుపరి రికార్డు అసిస్టెంట్ కె. ప్రణీత ముందుమాట చదివి వినిపించారు. సంపత్ యొక్క జనన,విద్య,ఉద్యోగ విశేషాలు మరియు వారితో పని చేసిన సమయంలో వారి అనుభవాలను పంచుకున్నారు. వారు శాంతి స్వభావం నిజాయితీ ఉన్నతన ఆలోచనలు స్టాఫ్ కు స్ఫూర్తిదాయకం అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలు సమ్మర్ క్యాంపులు, తదితర ప్రోగ్రామ్స్ విజయవంతంగా నిర్వహించారని కలెక్టర్ అధ్వర్యంలో గుర్తు చేశారు. వారి నుండి అనేక విషయాలు నేర్చుకునే అవకాశం వచ్చినందుకు వారి కృతజ్ఞతలు తెలియజేశారు. వారి ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుని కోరుకున్నారు.తదుపరి సభ వెల్కమ్ డాన్స్ తో పాప శ్రీ తన్వి తో సభ ప్రారంభించడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఉమ్మడి కృష్ణ గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సంపత్ కుమార్ అంకితభావంతో, నిజాయితీగా పనిచేస్తారని, విధి నిర్వహణలో వారి రికార్డ్స్ అన్ని పర్ఫెక్ట్ గా ఉంటాయని కొనియాడారు. అంతేకాకుండా గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. దాతలు నుండి ఫర్నిచర్ పుస్తకాలు సేకరించి గ్రంథాలయ పాఠకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించే వారన్నారు. ఈ గ్రంథాలయంలో చదువుకొని అనేకమంది ఉద్యోగాల సంపాదించి అత్యున్న స్థానాలు అధిరోహించారన్నారు. తదుపరి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ హెడ్ ఆఫీస్ సూపర్నెంట్ విజయకుమార్ మాట్లాడుతూ సంపత్ కుమార్ వారి కున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ వారి యొక్క అనుభవాన్ని పంచుకున్నారు. గ్రంథాలయ పాఠకులతో నేర్పుగా వ్యవహరించేవారున్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని ఉద్యోగులంతా ముందుకు సాగాలన్నారు. శారదా కాలేజ్ ప్రిన్సిపల్ లుక్కా శ్రీధర్ మాట్లాడుతూ సంపత్ గ్రంథాలయంలో నిర్వహించే వివిధ ప్రోగ్రామ్స్ లో చిల్డ్రన్స్ ను ఆకట్టుకునే శక్తి ఉందన్నారు. సంపత్ గారు చెప్పిన వెంటనే స్కూల్ ప్రిన్సిపాల్ అండ్ కాలేజీ ప్రిన్సిపల్స్ వారి మృదువైన మాటను తీసుకొని వెంటనే స్టూడెంట్స్ ని పంపిస్తారని, అలా ప్రోగ్రామ్స్ ను విజయవంతం చేస్తారని తెలియజేశారు. అంతేకాకుండా వారు మంచి సింగర్ అని ప్రోగ్రామ్స్ హాజరైన విద్యార్థులకు దేశభక్తి గీతాల్లో శిక్షణ ఇచ్చే వారన్నారు. గ్రంథాలయంలో, తరగతి గదిలో తలరాతలు గురువు లారా అనే పాటను పాడి అందరి సమక్షంలో వినిపించుకున్నారు. కొనియాడా రు.ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాల సంస్థ యూనియన్ అధ్యక్షులు/ డిప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకటరమణ సభాధ్యక్షులుగా వ్యవహరించారు. వారు మాట్లాడుతూ సంపత్ కుమార్ మంచి మృదు స్వభావని, మరియు గ్రంథాలయంలో మరియు యూనియన్ లో అనేక ముఖ్యమైనటువంటి పాత్రలు విజయవంతంగా పోషించేవారు అన్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు కల్లేపల్లి మధుసూదన రాజు మాట్లాడుతూ సంపత్ కుమార్ మంచి నేర్పు ఓర్పు సహనం కలిగిన వ్యక్తం అన్నారు. యూనియన్ స్టేట్ డెలిగేట్ కె. నాగరాజు మాట్లాడుతూ యూనియన్ తో అనుబంధాన్ని పంచుకున్నారు.అసోసియేట్ ప్రెసిడెంట్ ఐ.వి రామారావు మాట్లాడుతూ యూనియన్ లో వైస్ ప్రెసిడెంట్ గా న్యాయం చేకూర్చారన్నారు.రిటైర్డ్ లెక్చరర్ బి సావిత్రి మాట్లాడుతూ గ్రంథాలయంతో సంపత్ కి మరియు స్టూడెంట్స్కు ఉన్న అనుబంధం మరియు పుస్తకాలు యొక్క గొప్పతనం గ్రంథాలయం యొక్క ప్రాముఖ్యత అనేక విషయాలు గురించి వివరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కె రాంబాబు మాట్లాడుతూ 2019వ సంవత్సరం నుండి మూడు సంవత్సరాలు పాటు సంపత్ కుమార్ తో పనిచేశానని వారి యొక్క అనుభవాన్ని నేర్చుకున్నాను అని వారితో పనిచేయడం ఎంతో సంతోషిదాయకమని అన్నారు. రిసోర్స్ పర్సన్స్ వారి యొక్క అభిమానంతో సంపత్ కుమార్ తో కేక్ కటింగ్ చేయించడమైనది. నూతనముగా లైబ్రరీయన్ గా నియమింపబడిన కె వి ఎస్ ప్రసాద్ వందన సమర్పణ చేశారు. గ్రంథాలయ అధికారి పి. సంపత్ కుమార్ తనతో కలిసి పని చేసిన ఉద్యోగులకు, గ్రంధాలయానికి అండగా నిలిచిన దాతలకు, ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది డి మానస, పార్వతి, గ్రంథాలయ పాఠకులు అభిమానులు విజయవాడ పరిసర ప్రాంత లైబ్రేరియన్స్ ఈ కార్యక్రమంలో పాల్గొని ఘనంగా విజయవంతం చేశారు.

## కూటమి ప్రభుత్వంలో రైతన్నలకు ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా...

- ఆగస్టు 2న అన్నదాత, సుఖీభవ పధకం..
- రైత సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత..
- రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారధి..



**ఏలూరు/నూజివీడు,జూలై 31 (వార్తాప్రభ) :** ఆగస్టు 2వ తేదీ నుంచి అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్రంలో 46.85 లక్షల మంది రైతులకు రూ.3,174.40 కోట్లు ఆర్ధిక సాయం అందుతుందని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం వివరాలను తెలియజేస్తూ తొలివిడతలో కేంద్రం అందజేసే రూ. 2 వేలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 వేలు కలిపి మొత్తం రూ. 7 వేలు అందిస్తామన్నారు. అదే విధంగా 2వ విడతలో మరో రూ. 7 వేలు, 3వ విడతలో రూ. 6 వేలు, ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. అర్హులైన రైతులందరికి అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందుతుందన్నారు. ఈ నగదు జమవల్ల వేలాది రైతులకు ఉపసమనం కలగనుందన్నారు. ఏలూరు జిల్లాలో అన్నదాత సుఖీభవ కింద 1,51,694 మంది రైతులు ప్రయోజనం పొందుతారన్నారు. నూజివీడు నియోజకవర్గంలో 33,405 మంది రైతుల ఖాతాలకు ఆగస్టు 2వ తేదీనే అన్నదాత సుఖీభవ సొమ్ము జమకానుందన్నారు.

## రామచంద్రపురం ప్రజలకు ఉచిత న్యాయ సలహాలు

- మంత్రి సుభాష్ ను కలిసిన పలువురు న్యాయవాదులు
- మంత్రి క్యాంపు కార్యాలయంలో నెలలో ఒకరోజు లీగల్ సెల్



**రామచంద్రపురం,జూలై 31 (వార్తాప్రభ) :** రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలకు ఇకనుంచి ఉచితంగా న్యాయ సలహాలు, సూచనలు అందించేందుకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవ తీసుకున్నారు. ప్రముఖ న్యాయవాది లకాని పద్మ కమల కుమారి ఆధ్వర్యంలో గురువారం లీగల్ సెల్ కమిటీ (న్యాయవాదుల బృందం) మంత్రి సుభాష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ న్యాయవాదులతో పలు అంశాలపై చర్చించారు. నెలలో ఒకరోజు శని లేక ఆదివారాల్లో సమయం కేటాయించి లీగల్ సెల్ బృందం రామచంద్రపురం నియోజవర్గంలోని ప్రజలకు ఉచితంగా న్యాయ సలహాలు, సూచనలు ఇవ్వాలని నిర్ణయించారు. ఎవరికైనా న్యాయ సహాయం అవసరమైతే మంత్రి క్యాంపు కార్యాలయంలో సంప్రదిస్తే లీగల్ కమిటీ వారికి న్యాయ సహాయం అందిస్తారు. అనంతరం న్యాయవాదుల బృందం కూటమి పార్టీ సీనియర్ నాయకులు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం ని కూడా మర్యాదపూర్వకంగా కలిసారు.

## ఎంఈఓ 1 పోస్ట్ లలో ఎఫ్ఏసి లేదా రెగ్యులర్ పదోన్నతులకు జిల్లా పరిషత్ యాజమాన్యం ఉపాధ్యాయులనే తీసుకోవాలి

**-ప్రభుత్వానికి నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి**

**విజయవాడ,జూలై 31 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో ఎన్నో సంవత్సరాల నుంచి అపరిష్కృతంగా ఉన్న కామన్ సర్వీస్ రూల్స్ మరియు ఇతర అంశాలపై జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేయుచున్న ఉపాధ్యాయులకు జరుగుతున్న అన్యాయం పై అనేకమార్లు విద్యాశాఖ అధికారులు దృష్టికి నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రక్షణ తీసుకురావడం జరిగింది. అని అందులో భాగంగా మండల విద్యాశాఖ అధికారి పోస్టులు అన్ని కేవలం జిల్లా పరిషత్ యాజమాన్యానికి సంబంధించిన పోస్టులే అని ఈ పోస్టులకు ప్రభుత్వం యాజమాన్యంలో పనిచేసే ప్రధానోపాధ్యాయులు మరియు స్కూల్ అసిస్టెంట్లకు ఎలాంటి సంబంధం లేదని సవివరమైన వినతి పత్రాన్ని గౌరవ విద్యాశాఖ డైరెక్టర్ కి ఆరు నెలల క్రితం లేక ద్వారా అందించడం జరిగిందని ఈ అంశంపై గౌరవ డైరెక్టర్ స్పందిస్తూ ఈ అంశాన్ని పై అడ్వకేట్ జనరల్ అభిప్రాయాన్ని తీసుకుని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ కు తెలియజేస్తామని చెప్పి ఉన్నారని కానీ అడ్వకేట్ జనరల్ కు ఎంఈఓ మండల విద్యాశాఖ అధికారి 1 పోస్టుల్లో ఎవరిని నియమించాలి అనే విషయంపై అభిప్రాయాన్ని అడిగినట్లు నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ కు లేక ద్వారా గాని మరి ఏ ఇతర మాధ్యమంలోనూ సమాచారం అందించలేదని అడ్వకేట్ జనరల్ కు ఈ విషయంపై అభిప్రాయం అడిగారు. వారి స్పందన ఏమిటి అని తెలుసుకోవాలని జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ ఎదురుచూస్తున్నందున ఈ విషయాలను బయటపెట్టాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అభిప్రాయం పడుతుందన్నారు .రాష్ట్రంలో ఉన్న 675 మండల విద్యాశాఖ అధికారి వన్ పోస్టుల్లో కేవలం 13 మాత్రమే లోకల్ కేడర్లో ఉన్న పోస్టులని మిగిలిన పోస్టులన్నీ లోకల్ క్యాడర్లో పేర్కొనబడలేదని ఈ పోస్టులన్నీ పంచాయతీరాజ్ యాజమాన్యంలో ఉన్న పోస్టులను విలీనం చేయటం ద్వారా సృష్టించబడినవిగా పేర్కొంటూ ఒక యాజమాన్యంలో పనిచేసే ఉద్యోగులపై వేరే యాజమాన్యంలో పనిచేసే అధికారులకు అధికారం ఇవ్వడం ఎంత మాత్రం భావ్యం కాదని ,ఒకే క్యాడర్ లో ఉన్న ఉపాధ్యాయుల్లో కొందరు మాత్రమే అధికారులు గా 97% జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేసే ఉపాధ్యాయులు ఉపాధ్యాయులుగా మాత్రమే ఉండాలనే వాదన అర్ధరహితమని దీనిని నవ్యంధ్ర టీచర్స్ అసోసియేషన్ వ్యతిరేకిస్తుందని పేర్కొంటూ వెంటనే ఈ విషయంపై ప్రభుత్వ స్పందనను తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

## నేటి నుంచి ఇండియన్ నెఫ్రాలజీ సొసైటీ సదరన్ చాప్టర్ వార్షిక సదస్సు

- ఎస్ఎస్ కన్వెన్షన్ నందు మూడు రోజుల పాటు కార్యక్రమాలు
- సదస్సుకు హాజరుకానున్న 600 మంది ప్రతినిధులు
- సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ డి. శ్రీహరి రావు
- 44వ వార్షిక సదస్సు బ్రోచర్లను ఆవిష్కరించిన ప్రఖ్యాత నెఫ్రాలజిస్టు డాక్టర్ నలమాటి అమ్మన్న తదితరులు




**విజయవాడ,జూలై 31 (వార్తాప్రభ) :** మూత్రపిండాల వ్యాధులకు సంబంధించిన అత్యాధునిక వైద్య చికిత్సల గురించి చర్చించేందుకు నగరంలోని ఎస్ఎస్ కన్వెన్షన్ వేదిక కానుంది. ఇండియన్ నెఫ్రాలజీ సొసైటీ సదరన్ చాప్టర్ 44వ వార్షిక సదస్సు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ప్రఖ్యాత నెఫ్రాలజిస్టు డాక్టర్ నలమాటి అమ్మన్న తెలిపారు. సదస్సుకు సంబంధించిన బ్రోచర్లను ఆయన ఆవిష్కరించారు. సూర్యారావుపేటలో గురువారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ అమ్మన్న మాట్లాడుతూ.. శుక్రవారం సాయంత్రం జరిగే ప్రారంభోత్సవ వేడుకలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ డి. శ్రీహరి రావు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన దాదాపు 600 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతారని వెల్లడించారు. అత్యాధునిక నెఫ్రాలజీ చికిత్సలు, ఆధునిక ఔషధాలు, నవీన ఆవిష్కరణ గురించి చర్చించేందుకు ఈ సదస్సు వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. నెఫ్రాలజీ వైద్య విభాగానికి సంబంధించి విజ్ఞాన సర్వస్వంగా ఈ సదస్సుకు రూపకల్పన చేసినట్లు తెలిపారు. వివిధ అంశాలపై నిపుణుల ప్రసంగాలు, ఆధునిక చికిత్సా విధానాలపై విశ్లేషణలు, చికిత్సల్లో ఎదురయ్యే సంక్లిష్టతలపై సదస్సులో చర్చా కార్యక్రమాలు జరుగుతాయని డాక్టర్ అమ్మన్న వివరించారు. దక్షిణ భారతదేశంలోని నెఫ్రాలజిస్టులకు, యువ వైద్య నిపుణులకు తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఈ సదస్సు గొప్ప అవకాశం అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాధిక, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

## బీసీ నేత తురక కిషోర్ అక్రమం..

**- వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు**



**పెనుగంచిప్రోలు,జూలై 31 (వార్తాప్రభ) :** మాచర్ల మాజీ మున్సిపల్ చైర్మెన్ బీసీ నేత తురక కిషోర్ అక్రమ అరెస్ట్ ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా మండల కేంద్రమైన పెనుగంచిప్రోలు లోనీ స్థానిక సత్రం సెంటర్ లో గల వారి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కిషోర్ గుంటూరు జిల్లా జైలు నుండి బెయిల్ పై విడుదలైన కొద్ది నిమిషాల్లోనే మరల వేరే కేసు అని చెప్పి రిమాండ్ చేసి జైలుకు పంపడం అక్రమం అని ఆయన పేర్కొన్నారు.కనీసం వారి కుటుంబ సభ్యులు మాట్లాడే అవకాశం లేకుండా ఒక బీసీ నేత పై పోలీసులు వ్యవహరించిన తీరును ప్రజలందరూ గమనిస్తున్నారని కూటమి ప్రభుత్వం బీసీలపై కక్ష సాధింపుచర్యలనుఅవలంబిస్తుందని తెలిపారు,కూటమి పాలనలో బీసీలకు రక్షణ చట్టం తీసుకువస్తామని మాయమాటలు చెప్పి ఈరోజు బీసీలను జైలు పాలు చేస్తున్నారని రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వనికి బిసిలు అంత ఏకమై ఓటు అనే ఆయుధం ద్వారా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు చెని రాంబాబు నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు దేరంగుల శ్రీనివాసరావు, పెనుగంచిప్రోలు గ్రామ పార్టీ అధ్యక్షులు గుడిమెట్ల శంకర్, గ్రామ ప్రచార కమిటీ అధ్యక్షులు వేముల గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగురాలైన కూతురి పట్ల అసభ్య ప్రవర్తనపై తండ్రి ఫిర్యాదు..!

**గుడివాడ,జూలై 31 (వార్తాప్రభ) :** గుడివాడ తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో గల మోటూరు గ్రామ పరిధిలో నివాసం ఉంటున్న గండికోట వెంకన్న అను వ్యక్తికి ఇద్దరు కుమార్తెలు సంతానం, వారిలో పెద్ద కుమార్తె దివ్యాంగురాలిను, అదే గ్రామానికి చెందిన నిందితుడు ఇబ్బా శివయ్య తండ్రి నరసింహారావు, వయసు 36సం, 28.07.2025 రాత్రి సుమారు 3.30 గంటల సమయంలో ఆమెను చేయి పట్టుకుని నోరు మూసి అవమానపరిచే విధంగా ప్రవర్తించినందుకు గాను మహిళా తండ్రి వెంకన్న ఇచ్చిన ఫిర్యాదుపై గుడివాడ తాలూకా పోలీస్ స్టేషన్ ఎస్.ఐ నంబూరి చంటి బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో మునిసిపల్ సమస్యలన్నీ పరిష్కరిస్తాం

- చైర్పర్సన్ మండవ కృష్ణకుమారి
- టిడ్కో ఇళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేసిన ప్రతిపక్ష సభ్యులు
- సాదాసీదాగా మునిసిపల్ కౌన్సిల్ సమావేశం



**నందిగామ,జూలై 31 (వార్తాప్రభ) :** స్థానిక బాబు జగజ్జీవన్ రామ్ సమావేశపు మందిరంలో గురువారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం ఛైర్మన్ మండవ కృష్ణకుమారి అధ్యక్షతన జరిగినది.ఈ సమావేశంలో ముఖ్యంగా పట్టణంలో చేపట్టబోయే డ్రైన్లు, సిసీ. రోడ్ల . నిర్మాణం, మంచినీళ్ల పైపులైన్లు, కరెంటు స్తంభాల ఏర్పాటు తదితర అంశాలకు సంబంధించి న 43 అంశా లకు సంబంధించి పనులకు కౌన్సిల్ సమావేశంలో ఆమోదించటం జరిగింది. మంచినీరు, టిట్కో ఇళ్ళ నిర్మాణం తదితర అంశాలపై అధికార - ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యుల మధ్య కొద్దిసేపు వాదోప వాదనలు జరిగాయి . ప్రతిపక్ష కౌన్సిలర్లు మాట్లాడుతూ నందిగామ పట్టణం లో కొరత లేకుండా అందరికీ మంచినీరు అందించాలి, టిట్కో ఇళ్ళు త్వరితగతిన నిర్మించి లబ్ధిదారులకు అందజేయాలి అని డిమాండ్ చేశారు. అధికారపక్ష కౌన్సిలర్ సభ్యులు అమరయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వ 5 సంవత్సరాల కాలంలో టిట్కో ఇళ్ళు ఎందుకు నిర్మించలేక పోయారని ప్రశ్నించారు. ఛైర్మన్ మండవ కృష్ణకుమారి మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం వచ్చి సంవత్సరకాలం అయిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అప్పుల లో ఉన్న విషయం అందరికీ తెలిసినదే నని టైం పడుతుందని శాసనసభ్యులు సౌమ్య సహకారంతో ముందు ముందు రోజులలో అన్నీ పనులు పూర్తి చేస్తామని అన్నారు. కమిషనర్ లోవరాజు మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమం లో మిగిలిపోయిన పనులు పూర్తి చేస్తామని,అందరికీ మంచినీళు అందించే దానికి చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిల రు,ఏఇ .శ్రీనివాసరావు , మీడియా మిత్రులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రణవ్ సాయికి జర్నలిస్టు నేతల ఆశీస్సులు



**హనుమాన్ జంక్షన్, గన్నవరం,జూలై 31 (వార్తాప్రభ) :** సూర్య దినపత్రిక మచిలీపట్నం స్టాఫ్ రిపోర్టర్ కురేటి సతీష్ మేనల్లుడు ప్రణవ్ సాయి నూతన వస్త్ర భాహుకరణ వేడుక బుధవారం గన్నవరం ఎబి కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) న్యూఢిల్లీ సంఘ ఉపాధ్యక్షులు బడే ప్రభాకర్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ న్యూస్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయకులు తాడి రంగారావు, టీవీ రంగారావు తదితరులు పాల్గొని చిరంజీవి ప్రణవ్ సాయికి హార్ధిక ఆశీస్సులు అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, జర్నలిస్టులు , కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై, వేడుకను శుభాకాంక్షలతో ఉల్లాసంగా జరిపారు.

## స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కరపత్రాలు పంపిణీ




**కంకిపాడు,జూలై 31 (వార్తాప్రభ) :** విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ ప్రజా వేదిక ఆధ్వర్యంలో కంకిపాడులో కరపతాల పంపిణీ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని స్థానిక బీసీ కాలనీలో కడప గడపకు వెళ్లి స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు .ఈ సందర్భంగా ప్రజావేదిక నాయకులు టి నరేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల పేద మధ్య తరగతి కుటుంబాల వారితో సహా వ్యాపార వాణిజ్య సంస్థలకు కరెంట్ బిల్లులు విపరీతంగా పెరిగి వస్తున్నాయి కరెంటు ఎక్కువగా కాల్చకపోయినా సర్దుబాటు చార్జీల పేరిట అదనంగా వసూలు చేస్తున్నారు సామాన్య మధ్య తరగతి ప్రజలందరికీ ఇవి మోయలేని భారంగా అయ్యాయన్నారు. మరింత దోపిడీకి ఆస్కారం కలిగించేలా ప్రతి ఇంటికి విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగుస్తున్నారు ఇప్పటికే వాణిజ్య వ్యాపార సంస్థలతో పాటుగా పరిశ్రమలకు బిగించారు. ఇప్పుడు పట్టణాల్లో ఇళ్లకు బిగి స్తున్నారు స్మార్ట్ మీటర్లు బిగించిన అనంతరం షాపులుకు రెండు మూడు రెట్లు ఛార్జీలు పెరిగాయి, స్మార్ట్ మీటర్లు బిగించాక ప్రస్తుతం ఉన్న పరిస్థితి కన్నా భిన్నంగా ముందే బ్యాలెన్స్ వేయించుకోవాలి మీటర్ ఖరీదు 9000 నుంచి 17 వేల వరకు వినియోగదారుదే చెల్లించాలి అధిక విద్యుత్ వినియోగించే సాయంత్రం సమయంలో అధిక రేట్లు నిర్ణయించి వసూలు చేయడం అన్యాయం అన్నారు. పైగా జవాబు దారితనం కూడా ఉండదు కనక ట్రూఅప్, సర్దిపాటు చార్జీల పేరిట పెంచిన చార్జీలను తగ్గించాలని సోలార్ విద్యుత్ ఒప్పందం రద్దు చేయాలి, పాత మీటర్లను కొనసాగిస్తూ పాత రీడింగ్ పద్ధతుల్ని అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా వేదిక నాయులు వీ శివశంకర్, జి కుమారి,కె. నాంచరయ్య, టి దివ్య, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.




కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు ఐపీఎస్ వారి ఆదేశాల మేరకు గుడివాడ డిఎస్పి ధీరజ్ వినీల్ సారథ్యంలో గుడివాడ సి.ఐ. ఎస్ ఎల్ ఆర్ సోమేశ్వరావు ఆధ్వర్యంలో గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్లో కొత్తగా ట్రైనింగ్ నిమిత్తం వచ్చిన మహిళ ప్రొబేషనరీ సబ్ ఇన్స్పెక్టర్ కుమారి టి లోకేశ్వరి ధైర్యంగా రాత్రి గస్తీ విధులు నిర్వహిస్తూ నేరాల నియంత్రణ చేసినందుకుగాను గుడివాడ ఎస్డిపిఓ వారు ఆమెను రివార్డుతో అభినందిస్తున్న దృశ్యం..

**-గుడివాడ,జూలై 31 (వార్తాప్రభ) :**

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188